RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 26 జూలై 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:50

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

**నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ తప్పుకొంటున్నట్లు ప్రకటన**
**గత కొన్నిరోజుల పరిణామాలు బాధించాయని వ్యాఖ్య**
**వ్యక్తిగత ప్రతిష్ఠకు పోవడం లేదని వెల్లడి**
**యువత ఆకాంక్షలను గౌరవిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నవైనం**
**మోదీకి రాజీనామా పత్రాన్ని పంపిన ప్రధాన్**

దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీక్, పరీక్షల అక్రమాలపై కొనసాగుతున్న ఆందోళనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి సమర్పించిన ఆయన.. దేశ యువత ఆకాంక్షలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

రాజీనామా లేఖలో ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ.. నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణల కోసం పనిచేస్తున్నానని పేర్కొన్నారు. నీట్-యూజీ పరీక్షలో అక్రమాలు వెలుగులోకి రాగానే కేంద్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిందని, పరీక్షను రద్దు చేసి రీ-ఎగ్జామ్ నిర్వహించిందని గుర్తు చేశారు. వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

20 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేశాయని ప్రధాన్ చెప్పారు. పరీక్షా మాఫియా వల్ల ఒక్క ప్రతిభావంతుడికీ అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతో మొదటి రోజు నుంచే తాను బాధ్యత తీసుకున్నానని తెలిపారు. అయితే రీ-ఎగ్జామ్ ఫలితాల సమయంలో కొందరు బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వ్యక్తులు విద్యార్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం తనను తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు.

గత పది రోజులుగా జరిగిన పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయని, ఇది వ్యక్తిగత ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కాదని ప్రధాన్ స్పష్టం చేశారు. జంతర్‌మంతర్‌తో పాటు దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, దేశ వ్యతిరేక శక్తులు ఈ అంశాన్ని ఉపయోగించుకోకుండా ఉండేందుకు, విద్యార్థుల భవిష్యత్తు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా కాపాడేందుకు, వారు చదువుపై దృష్టి పెట్టేలా చేయడానికే తాను రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ప్రధాని మోదీ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపిన ఆయన, ప్రజాసేవను ఇకముందు కూడా కొనసాగిస్తానని పేర్కొన్నారు.

కొందరు నిరుద్యోగులను ఉద్దేశించి సీజేఐ చేసిన వ్యాఖ్యలతో పుట్టిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ).. నీట్ పేపర్ లీక్, విద్యావ్యవస్థలో అవకతవకలపై 2026 జూన్ నుంచి ఉద్యమం మొదలుపెట్టింది. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజుల నిరాహార దీక్షతో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. ఢిల్లీలోని జంతర్‌మంత్ వేదికగా సాగిన ఈ పోరు అనతి కాలంలో అనూహ్య ఆదరణను సొంతం చేసుకుంది. జులై 20న పార్లమెంట్ ముట్టడి లక్ష్యంగా తలపెట్టిన 'చలో సంసద్' కార్యక్రమంతో ఉద్యమం మరో స్థాయికి చేరింది. పోలీసుల లాఠీఛార్జి, వాంగ్‌చుక్‌ను బలవంతంగా ఆసుపత్రికి తరలించడం వంటి పరిణామాలతో దేశవ్యాప్తంగా యువత, ప్రముఖులు తమ గొంతుకను వినిపించారు.

దీంతో దిగొచ్చిన కేంద్రం విద్యార్థులతో చర్చలు ప్రారంభించింది. స్వయంగా ప్రధాని ఉద్యమాన్ని చల్లార్చేందుకు ప్రకటనలు చేశారు. నీట్ పేపర్ లీక్‌కు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పేపర్ లీక్ కేసులను వేగంగా విచారించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అలాగే సంబంధిత చట్టాలను సైతం కఠినతరం చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో విద్యార్థులతో శు



క్రవారం రెండు దఫాలు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లను ఉంచారు. వాటిలో నీట్ పేపర్ లీక్ వల్ల చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, నిరసన చేపట్టిన విద్యార్థులపై చట్టపరమైన చర్యలు తీసుకోబోమని హామీ వంటి వాటికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. దీంతో వాంగ్‌చుక్ సైతం తన దీక్షను విరమించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో మాత్రం సంశయించింది. కానీ, విద్యార్థులు ఆ విషయంలో వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పడంతో మంత్రి రాజీనామా చేయక తప్పలేదు.

## విద్యార్థుల ఐక్యతను చూసి గర్విస్తున్నాను: రాహుల్ గాంధీ



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. దేశంలో విద్యా వ్యవస్థను తిరిగి సరైన మార్గంలో పెట్టేందుకు ఈ పరిణామం ఒక పెద్ద అడుగు అని అభివర్ణించారు. వీధుల్లోకి వచ్చి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, తమ భవిష్యత్తును కాపాడుకునేందుకు పోరాడిన ప్రతి విద్యార్థికి, యువకుడికి హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానని సోషల్ మీడియా వేదికగా సందేశాన్ని విడుదల చేశారు. విద్యార్థుల ఐక్యతను చూసి గర్విస్తున్నానని రాహుల్ వ్యాఖ్యానించారు. మంత్రి పదవి నుంచి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకొన్నప్పటికీ, తమ ప్రధాన డిమాండ్లు ఇంకా నెరవేరలేదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులు, దేశ భవిష్యత్తును గౌరవిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన హింసకు, లాఠీఛార్జీలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే రెండు ముఖ్యమైన డిమాండ్లు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తుచేశారు. బాధ్యులైన ప్రతీ ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టాల్సిందేనని ఉద్ఘాటించారు.

ఈ ప్రభుత్వం చేతిలో అణచివేతకు గురైన రైతులు, కూలీలు, పేదలు, ఇతర వర్గాల ప్రజలందరూ తమ ఆత్మగౌరవం కోసం రాజ్యాంగబద్ధంగా నిలబడాల్సిన సమయం వచ్చిందని రాహుల్ పిలుపునిచ్చారు. అణచివేతకు భయపడకుండా ధైర్యంగా నిలబడటంలోనే అసలైన నిరసన బలం ఉందన్నారు. ఈ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించిన రాహుల్ గాంధీ, "ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు" అని పేర్కొన్నారు.

## నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



నెక్లెస్ రోడ్‌లో ప్రారంభమైన టీపీసీసీ కొవ్వొత్తుల ర్యాలీ
నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ
ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్‌ని ఖండిస్తూ నిరసన
విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా టీపీసీసీ ర్యాలీ
పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ
ర్యాలీలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి
టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హాజరు
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు
మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు హాజరు
పెద్ద ఎత్తున విద్యార్థులు, ప్రజాప్రతినిధుల పాల్గొనడం
నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
విద్యార్థులకు న్యాయం చేయాలని టీపీసీసీ డిమాండ్

**టీపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ**

కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ర్యాలీ
సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు వేలాది మంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు
ఏక చిత్రాధిపత్యం కి వ్యతిరేకంగా యావత్ విద్యార్థి లోకం ఏకమై
నీట్ పరీక్ష సక్రమంగా నిర్వహించలేని దుస్థితి
చైనా చొచ్చుకొస్తుంటే అడ్డుకోలేని దుస్థితి
విద్యార్థి లోకానికి తలొగ్గి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
విద్యార్థులపై లాఠీ చార్జ్ యావత్ దేశం ముక్తం కంఠం తో ఖండించింది
ప్రజా ఉద్యమానికి మోదీ తలవంచుకొని ధర్మేంద్ర రాజీనామా
కొండగల్ లో సీఎం యాత్ర, వరంగల్ లో డిప్యూటీ సీఎం ర్యాలీ, టిపిసిసి ఆధ్వర్యంలో ర్యాలీ
ఆ నాడు రాజీవ్ గాంధీ 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించారు
నేటి యువతకు అసెంబ్లీ, పార్లమెంట్ లో మాట్లాడలేని పరిస్థితి
రాహుల్ గాంధీ ప్రధాని అయితే జెన్ జీ లో ఒకరు విద్యాశాఖ మంత్రి
21 ఏళ్లకే చట్ట సభల్లో కి వెళ్ళే విధముగా సీఎం రేవంత్ గారు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి
తెలంగాణ నుంచి యువత చట్ట సభల్లో కి వెళ్ళే కార్యక్రమం మొదలు కావాలని ఆకాంక్ష

## ఇది యువత సాధించిన విజయం: ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ప్రియాంక గాంధీ



నీట్-యూజీ పరీక్షల అవకతవకల వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని, వారి గొంతును ఎవరూ, ఎప్పటికీ అణచివేయలేరని ఆమె స్పష్టం చేశారు.

శనివారం తన లోక్‌సభ నియోజకవర్గమైన కేరళలోని వయనాడ్‌లో విలేకరులతో మాట్లాడిన ప్రియాంక గాంధీ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వార్త తనను కొంత భావోద్వేగానికి గురిచేసిందని తెలిపారు. "గత పది, పన్నెండేళ్లుగా మన యువత ఎప్పుడు చైతన్యవంతమవుతుందా అని నేను అనేకసార్లు నన్ను నేను ప్రశ్నించుకున్నాను. నేడు దేశ యువత గళం విప్పింది, వారి గొంతు వినిపించింది. ఇది ఎంతో సంతోషకరమైన విషయం" అని ఆమె పేర్కొన్నారు.

ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పిస్తూ, "ఆర్ఎస్ఎస్ తన భావజాలంతో మొత్తం విద్యా వ్యవస్థను నింపేస్తోంది. మన పూర్వీకుల సిద్ధాంతాలను ప్రణాళికాబద్ధంగా నాశనం చేస్తున్నారు. నిరసన తెలిపిన వారిపై అధికార బలాన్ని ప్రయోగించారు. అయితే, ప్రజలే అత్యంత శక్తివంతులని ప్రతి పాలకుడూ ఈ ఘటన ద్వారా గుణపాఠం నేర్చుకోవాలి. ఈ రోజు మన దేశాన్ని మనం తిరిగి నిలబెట్టుకుంటున్నాం" అని ఆమె వ్యాఖ్యానించారు.

నీట్-యూజీ పేపర్ లీక్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ మద్దతుతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు ఉద్ధృతంగా జరిగాయి. కేంద్ర మంత్రి రాజీనామా చేయాలన్నది వారి ప్రధాన డిమాండ్‌గా ఉంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ప్రజాస్వామ్య విజయంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, సోనమ్ వాంగ్‌చుక్ అభివర్ణించారు.

## 21 ఏళ్లకే చట్ట సభల్లో అర్హత...

**పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రతిపాదనలు.**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకారం...**



యువత చట్ట సభల్లో 21 ఏళ్లకే వచ్చే విధంగా చట్ట సవరణ చేయాలని ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు.

అందుకు స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆగస్టు మొదటి వారంలో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టి అసెంబ్లీ లో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామని కేంద్రంలో ఆమోదం పొందే విదంగా కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందని అన్నారు.. మహేష్ కుమార్ గౌడ్ ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతు పలికి అసెంబ్లీ లో తీర్మానం చేస్తామని హామీ ఇవ్వడంతో యువత లో మంచి స్పందన వచ్చింది..

# ప్రజాబలం

26 జూలై 2026 ఆదివారం


## విద్యావ్యవస్థలో సంస్కరణలు అవసరం

“ఒక దేశ నాశనానికి అణుబాంబులు కానీ, సుదూర క్షిపణులు కానీ అవసరం లేదు. విద్యా వ్యవస్థ ప్రమాణాలను తగ్గించి, విద్యార్థులను పరీక్షల్లో మోసం చేయడానికి అనుమతిస్తే చాలు.. ఆ దేశం తనంతట తానే కూలిపోతుంది.”దక్షిణాఫ్రికాలోని ఒక ప్రముఖ విశ్వవిద్యాలయ ప్రవేశ ద్వారం వద్ద పెద్ద అక్షరాలతో ఊ సత్యం రాసి ఉంటారు. సరిగ్గా ఈ కొటేషన్ మన దేశంలో నేడు చోటుచేసుకుంటున్న పరంపరలకు అద్దం పడుతోంది. దొరికినవాడే దొంగ.. దొరకనంత వరకు అందరూ దొరలే అన్నట్లుగా తయారైంది మన దేశంలోని పోటీ పరీక్షల తీరు. నీట్ ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీ ఉదంతం దేశవ్యాప్తంగా లక్షల మంది విద్యార్థులలో, వారి తల్లిదండ్రులలో సృష్టించిన ఆగ్రహజ్వాలలు ఇంకా చల్లారలేదు. ప్రశ్నాపత్రం లీక్ అయిందని ఆధారాలతో సహా రుజువు కావడంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేసి, తీవ్ర నిరసనల మధ్య మళ్లీ నిర్వహించింది. అంతవరకు బాగానే ఉంది. కానీ, ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే ఈసారి దొరికింది కాబట్టి లీకేజీ బయటపడింది; మరి దొరకకుండా వెనుక తలకాయలు నడిపిన ముఠాలు, గతంలో జరిగిన పరీక్షల్లో ఎంతటి అక్రమాలకు పాల్పడి ఉంటాయి? భవిష్యత్తులో ఇవి మళ్లీ జరగవని గ్యారెంటీ ఏమిటి?మన విద్యా వ్యవస్థలో పేపర్ లీకేజీలు అనేవి ఒక సాధారణ రుగ్మత గా మారిపోవడం సమగ్ర ప్రజాస్వామ్యానికే పెను ప్రమాద ఘంటిక. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన అత్యున్నత వైద్య విద్యా ప్రవేశ పరీక్ష నీట్ లో చోటుచేసుకున్న అవకతవకలు బయటపడటంతో కేంద్ర ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. కేసు విచారణను సిబిఐ కి అప్పగించడం, దర్యాప్తు సంస్థలు బీహార్, గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో నిందితులను అరెస్ట్ చేయడం, ముఠాల గుట్టు రట్టు చేయడం చరచరా జరిగాయి. హైటెక్ పద్ధతుల్లో వాట్సాప్ గ్రూపులు, సేఫ్ హౌస్‌లలో విద్యార్థులకు సమాధానాలు బట్టీ పట్టించడం వంటి ఘోరాలు వెలుగు చూశాయి. దేశంలో యువతరం రోడ్లపైకి వచ్చింది. లీకేజీల వ్యవస్థపై అసహనం శృతిమించి కాక్రోచ్ పేరుతో సరికొత్త నిరసన ఉద్యమాలు రూపుదిద్దుకున్నాయి. లీకేజీలు, వ్యవస్థాగత లోపాల వల్ల తమ భవిష్యత్తు చీకటిమయమవుతోందన్న ఆవేదన, ఆగ్రహం యువతలో ఏ స్థాయిలో ఉందో ఈ నిరసనల ఉద్ధృతి స్పష్టం చేస్తోంది.మన దేశ పారదర్శకతకు పేపర్ లీకేజీలు కొత్తేమీ కావు. దశాబ్దాల చరిత్రను తిరగేస్తే, ప్రతిష్టాత్మక కేంద్ర, రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ఎన్నో సార్లు లీకేజీ ఘటనలు వెలుగు చూశాయి. బయటపడి, రగడ తీవ్రమైనప్పుడు మాత్రమే ప్రభుత్వాలు రద్దు నిర్ణయాలు తీసుకున్నాయి. సమాజం దృష్టికి రాని, ఆధారాలు దొరకని ఎన్నో సందర్భాల్లో అక్రమార్కులు అత్యున్నత ర్యాంకులు పొంది వ్యవస్థలోకి ప్రవేశించి ఉంటారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. దీనివల్ల రాత్రింబవళ్లు కష్టపడి చదివిన నిజమైన ప్రతిభావంతులు, నిరుపేద విద్యార్థులు శాశ్వతంగా తమ అవకాశాలను కోల్పోయారు. గతంలో జరిగిన నష్టాన్ని ఇప్పుడు పునరుద్ధరించలేకపోవచ్చు, కానీ భవిష్యత్తు తరాల భవితవ్యాన్ని రక్షించడానికి శాశ్వత, కఠిన కట్టడి చర్యలు వంద శాతం అవసరం. ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమనాలు లేదా చిన్నచిన్న కమిటీలతో సరిపెడుతున్న పాలకులు, ఈ వ్యవస్థాగత చీడను తుడిచిపెట్టే శాశ్వత పరిష్కారాల వైపు అడుగులు వేయకపోవడమే అసలు విషాదం. పేపర్ లీకేజీల మహమ్మారి కేంద్ర పరిధిలోని పరీక్షలకే పరిమితం కాలేదు. తెలుగు రాష్ట్రాల్లో వైఫల్యాలు అనేకమంది అభ్యర్థుల జీవితాలను బుగ్గిపాలు చేశాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి ఎంసెట్ లీకేజీలు పదే పదే కలకలం రేపాయి. ముఖ్యంగా 2016 లో తెలంగాణలో జరిగిన ఎంసెట్-2 మెడికల్ పేపర్ లీకేజీ ఘటన దేశాన్నే గ్భ్రాంతికి గురిచేసింది. ఆల్ ఇండియా స్థాయిలో నెట్‌వర్క్ నడిపి, కోట్ల రూపాయలు వసూలు చేసి ప్రింటింగ్ ప్రెస్ స్థాయి నుంచే పేపర్ లీక్ చేశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సి వచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలోనే కంప్యూటర్లు హ్యాక్ చేసి, అంతర్గత సిబ్బంది ద్వారా గ్రూప్-1 ప్రిలిమ్స్, అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్షల పేపర్లు లీక్ కావడం అత్యంత భయంకరమైన ఉదంతం. ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో మగ్గిపోయిన నిరుద్యోగ యువత రోడ్లెక్కి ఉద్యమించాల్సి వచ్చింది. ఈ లీకేజీల ఫలితంగా పదే పదే పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. తరచూ టెన్త్ క్లాస్ బోర్డు పరీక్షల ప్రశ్నాపత్రాలు పరీక్ష ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే వాట్సాప్ గ్రూపుల్లో ప్రత్యక్షం కావడం, ఉపాధ్యాయులు, కార్పొరేట్ విద్యాసంస్థల ప్రతినిధులు అరెస్ట్ కావడం మనం చూస్తూనే ఉన్నాం. మరోవైపు, ఒకే దేశం ? ఒకే పరీక్ష అనే అతిగా కేంద్రీకృతమైన నినాదం కూడా తీవ్రమైన సమస్యలను తెచ్చిపెడుతోంది. భారత్ లాంటి విభిన్నమైన, విశాలమైన దేశంలో కోట్లాది మందికి ఒకే ఏజెన్సీ ద్వారా ప్రవేశ పరీక్షలను నిర్వహించాలనుకోవడం పరిపాలనాపరంగా అత్యంత ప్రమాదకరమైన ప్రయోగం. దేశంలో ఎక్కడో ఒక మూలన ఉన్న పరీక్షా కేంద్రంలో చిన్న లోపం జరిగినా, లేదా ఒక డిజిటల్ నెట్‌వర్క్ హ్యాక్ అయి పేపర్ బయటకు వచ్చినా.. దేశవ్యాప్తంగా ఉన్న 20 నుండి 25 లక్షల మంది విద్యార్థుల శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతుంది. అంతేకాకుండా, రాష్ట్రాల విద్యా బోర్డుల స్వయంప్రతిపత్తి దెబ్బతిని, ప్రాంతీయ వ్యత్యాసాలు ఉన్న విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది.ప్రజాస్వామ్యంలో నిరసన అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు. అది ప్రభుత్వాల కళ్లు తెరిపించడానికి, వ్యవస్థాగత సంస్కరణలు సాధించడానికి ఉపయోగపడాలి. కానీ, ఆ నిరసనలు ప్రజా ఆస్తుల విధ్వంసానికి, హింసకు దారితీస్తే అది అరాచకత్వానికి దారితీసి, అసలు ఆశయానికే విఘాతం కలిగిస్తుంది.ప్రస్తుతం యువత జరుపుతున్న కాక్రోచ్ ఆందోళనలను , నీట్ నిరసనలను ప్రతిపక్షాలు ప్రత్యేకించి కాంగ్రెస్ వంటి పార్టీలు పూర్తిగా తమ రాజకీయ లబ్ధి కోసం హైజాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఇది ఉద్యమ స్వభావాన్ని రాజకీయం గా మార్చేస్తోంది. గతంలో కాంగ్రెస్ సుదీర్ఘ పాలన కాలంలో ఏ రకమైన అవినీతి, వ్యూహాత్మక లోపాలు, ప్రశ్నాపత్రాల కుంభకోణాలు జరిగాయో దేశంలో మధ్య వయస్సులో ఉన్న ప్రతి పౌరుడికీ స్పష్టంగా తెలుసు. నాటి యూపీఏ హయాంలో వెలుగుచూసిన దారుణాలు దేశం ఇంకా మరచిపోలేదు.హింసకు, రాజకీయ హైజాకింగ్‌లకు తావివ్వకుండా, ప్రజాస్వామ్య గీత దాటకుండా సాగే వైజ్ఞానిక, చట్టబద్ధమైన పోరాటాలే ఎంతటి మొండి ప్రభుత్వాల మెడలనైనా వంచుతాయి. సమగ్రమైన, శాశ్వతమైన విద్యా సంస్కరణలకు తిరుగులేని బాటలు వేస్తాయి. రాజకీయనాయకుల స్వార్థానికి, అవినీతి ముఠాల అక్రమార్జనకు లక్షలాది మంది ప్రతిభావంతులైన విద్యార్థుల కన్నీళ్లు, నిరుద్యోగుల నిరాశ బలికాకూడదంటే ప్రతి ప్రశ్నా ప్రజాస్వామ్య ఆయుధంగా మారాలి.ప్రశ్నించే గొంతుకలకు స్పష్టమైన కార్యాచరణ తోడైనప్పుడే పాలకులు దిగివస్తారు. రాజకీయాల రంగు పడకుండా, చట్టసభలు చుట్టుముట్టేలా యువత తెచ్చే ఈ మేధో సంచలనమే రాబోయే రోజుల్లో వ్యవస్థలకు అసలైన దిశానిర్దేశం చేస్తుంది. పారదర్శకతకు పట్టంకడుతూ, పేపర్ లీకేజీలు లేని స్వచ్ఛమైన సమర్థ భారత్ ను నిర్మించుకోవడమే మన విద్యా వ్యవస్థకు, కష్టపడే ప్రతిభావంతులైన యువతకు మన సమాజం అందించే అత్యున్నతమైన, అసలైన గౌరవం!

# ఇందిరమ్మ టవర్స్‌పై సందేహాల నివృత్తికి కాల్‌సెంటర్ హెల్ప్‌లైన్ ఏర్పాటు

**040-24603572 ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి**

**యూపిఐ ద్వారానే రూ.10వేల ఇఎండి చెల్లించాలి**

**ఇల్లు రాకపోతే అదే ఖాతాకు తిరిగి చెల్లిస్తాం**

**దరఖాస్తు సమయంలో ఎలాంటి పత్రాల సమర్పణ అవసరం లేదు**

**ఆధార్ ఒక్కటి చాలు**

**పదేళ్లు క్యూర్ పరిధిలో నివాసం ఉన్నవారు అర్హులు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్ :- హైదరాబాద్ మహానగరంలోని పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు నగర నడిబొడ్డున గౌరవప్రదమైన సొంతింటిని అందించాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పాన్ని కార్యరూపంలోకి తీసుకువస్తూ ప్రజా ప్రభుత్వం క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ౘ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఈ పథకంపై ప్రజల్లో ఎలాంటి గందరగోళం, అపోహలు లేకుండా దరఖాస్తు విధానం, అర్హతలు, అవసరమైన పత్రాలు, చెల్లింపులు, కేటాయింపు విధానం తదితర అంశాలపై పూర్తి సమాచారం అందించేందుకు ప్రత్యేక కాల్ సెంటర్ హెల్ప్‌లైన్‌ను శనివారం హౌసింగ్ బోర్డు కార్యాలయంలో మంత్రి గారు ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలు ఎలాంటి సందేహాలు ఉన్నా మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా 040-24603572 నంబర్‌కు ఉదయం 9 గంటల నుంచి సాయింత్రం 6గంటలమధ్య ఫోన్ చేసి అధికారిక సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం తెలుగు , హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో సమాచారం తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుంచి సరైన సమాచారం అందించేందుకు ఈ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు.

క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా తొలివిడతలో 16 నియోజకవర్గాలలో 7680 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని, ఏ నియోజకవర్గానికి చెందిన ప్రజలు అదే నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకోవాలని మంత్రిగారు సూచించారు. దరఖాస్తు దారులు ఎలాంటి విష ప్రచారాలను నమ్మకూడదని మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్,వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

హైదరాబాద్ క్యూర్ ఏరియా ప్రాంతంలో నివసిస్తున్న అల్పాదాయ వర్గాల కుటుంబాల కోసం ఈ పథకాన్ని రూపొందించామని కుటుంబ వార్షిక ఆదాయం ?6.00 లక్షల వరకు ఉండాలి. ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తు మాత్రమే స్వీకరించబడుతుందని అర్హత కలిగిన కుటుంబానికి ఒక ఫ్లాట్ మాత్రమే కేటాయించబడుతుందన్నారు. అందిన దరఖాస్తులను డిజిటల్ విధానంలో పరిశీలించడంతో పాటు, క్షేత్రస్థాయి పరిశీలన మరియు సమగ్ర ధృవీకరణ నిర్వహిస్తామన్నారు. నిర్మిస్తున్న ఫ్లాట్ల సంఖ్య కంటే అర్హులైన దరఖాస్తుదారుల సంఖ్య ఎక్కువగా ఉంటే, పారదర్శకమైన విధానంలో లాటరీ ద్వారా ఇండ్లను కేటాయిస్తామన్నారు.

దరఖాస్తుదారు క్యూర్ పరిధిలో పదేళ్లుగా నివాసం ఉండాలని, దరఖాస్తుదారు లేదా కుటుంబానికి ఓ ఆర్ ఆర్, క్యూర్ పరిధిలో సొంత ఇల్లు లేదా ఫ్లాట్ లేదా ప్లాట్ ఉండకూడదని, ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు ఒక ఫ్లాట్ మాత్రమే కేటాయింపు ఉంటుందని తెలిపారు.

దరఖాస్తు చేసే సమయంలో ఆధార్ నెంబర్ తెలియజేస్తే సరిపోతుందని ,కుల, జీత భత్యాల ధృవీకరణ పత్రాలను అప్ లోడ్ చేయాల్సిన అవసరం లేదని లాటరీ సమయంలో వీటిని సమర్పించవచ్చునని తెలిపారు.

దరఖాస్తు సమయంలో 10 వేల రూపాయిల చెల్లింపునకు యూపిఐ లేదా నెట్ బ్యాంకింగ్‌ను మాత్రమే ఉపయోగించాలని, ఒక వేళ ఇల్లు మంజూరు కాకపోతే తిరిగి అదే ఖాతాకు ఆ మొత్తం వాపసు అవుతుందన్నారు. పరిశీలన, కేటాయింపు, వాపసు తదితర సమాచారం పూర్తయ్యేవరకు మీసేవ రశీదు, చెల్లింపు రశీదు, దరఖాస్తు సంఖ్య, మొబైల్‌నెంబర్‌లను యాక్టివ్‌గా ఉంచుకోవాలని మంత్రి గారు సూచించారు.

ఈ పథకం కింద ప్రతిపాదించిన ఫ్లాట్లు ఒక బెడ్‌రూమ్, హాల్ మరియు కిచెన్‌తో, సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మిస్తున్నామన్నారు. ఒక్కో ఫ్లాట్ ఖరీదు 40 నుంచి 60 లక్షల రూపాయిల వరకు ఉంటుందని, ఇందులో ప్రభుత్వం ఐదు లక్షల రూపాయిల సబ్సిడీతో పాటు అన్ డివైడెడ్ షేర్ కింద 20 నుంచి 25 గజాల స్థలాన్ని కూడా లబ్ధిదారుని పేరిట రిజిస్ట్రేషన్ చేయడుతుందన్నారు. లబ్ధిదారుడు కేవలం ఆరు లక్షల రూపాయిలు మాత్రమే చెల్లించవలసి ఉంటుందన్నారు.

ఈకార్యక్రమంలో హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, హౌసింగ్ బోర్డు సీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

**రెండున్నర ఏళ్లలో దాదాపు 40 శాతం రియల్ ఎస్టేట్ వృద్ధి**

**త్వరలో మూసీ సుందరీకరణకు టెండర్లు**

**రియల్ ఎస్టేట్‌తో పాటు పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**





హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని దీనిలో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని అందువలన అటువంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు.

శనివారం నాడు నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని , 40 శాతం వరకు ఫ్లాట్ల విక్రయాలు వృద్ధిచెందాయని అన్నారు.

గడచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే నిదర్శనమన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంతమంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి గారు అన్నారు.

2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రులు చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందింది, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో కలిసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదూరదృష్టితో ప్రణాళికా బద్ధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ పట్టాలెక్కనుందని మంత్రి పొంగులేటి తెలిపారు. 28 కిలోమీటర్ల తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. అదేవిధంగా పాత బస్తీ తదితరాలను కలుపుతూ రెండవ విడతగా 76 కిలోమీటర్ల మేర 24వేల కోట్లరూపాయిల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఇవేగాక ట్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.

ప్రపంచంలోనే సుందరనగరమైన హైదరాబాద్ ను రియల్ ఎస్టేట్ రంగం పక్షాన కూడా మరింత అభివృద్ధి చెందడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు సహకారం అవసరమని, ప్రజలకు నమ్మకంగా, సకాలంలో ఫ్లాట్లను అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని మంత్రి హితవు పలికారు. రాష్ట్రంలో భూముల భద్రత , భరోసా కల్పించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని , వీటిలో కొన్ని చిన్న చిన్నసమస్యలను సాఫ్ట్ వేర్ పరంగా 15-20 రోజుల్లో సరిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలో తొలివిడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలు ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 2-3 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.

# రాహుల్ గాంధీ పోరాటం వల్లనే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా...

### రాహుల్ గాంధీ కీ లడాయి...
### దేశ్ కే ఛాత్రోం ఔర్ జనతా కీ భలాయి
### టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి









**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 25 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డిలో రాహుల్ గాంధీ విక్టరీ ర్యాలీలో పాల్గొన్న ఏఐసిసి సెక్రటరీ జెట్టి కుసుమ కుమార్, డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి,సంగారెడ్డి ఐబి గెస్ట్ హౌస్ నుండి పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర బాణాసంచా కలుస్తూ డప్పు వాయిద్యాలతో ఘనంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేశారు,అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ పోరాటం కారణంగా దేశ ప్రజలు, విద్యార్థులు బలోపేతం అవుతారు,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే అందుకు ఉదాహరణ,రాహుల్ గాంధీ పోరాటం వల్లనే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు,మోడీ ఇంటి ముందు ధర్నా చేసిన తర్వాత నే ఉద్యమం ఉధ్రుతమైంది,12 యేళ్లు పరిపాలన అని మిఠాయిలు పంచుకున్నారు..కానీ బీజేపీ ప్రభుత్వం వల్ల జరిగిన నీట్ పేపర్ లీక్ తప్పిదం వల్ల 14 మంది చనిపోయారు,దేశం లోని విద్యార్థుల అవస్థలు చూసి రాహుల్ గాంధీ వీధి పోరాటాలు మొదలు పెట్టారు,ప్రధాని మోడీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి, ధర్మేంద్ర ప్రధా న్ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు,రాహుల్ గాంధీ వొత్తిడి తో కేంద్ర మంత్రి గద్దె దిగిపోయారు,దేశం లోని వేలాది మంది విద్యార్థులు జంతర్ మంతర్ లో ఉద్యమం చేశారు,రాహుల్ గాంధీ కోట్లాడినందుకే మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది,దేశ ప్రజలు సుఖ శాంతులతో, భద్రతతో క్షేమంగా ఉండాలంటే ప్రధాన మంత్రి గా రాహుల్ గాంధీ కావాలి,రాహుల్ గాంధీ ఎప్పు డూ పిలుపు ఇచ్చి నా...మా సంగారెడ్డి ప్రజలు ఆందోళన కు సిద్ధం..రాహుల్ గాంధీ చెప్పితే కార్యక్రమాలు చేయడం కాదు, రాహుల్ గాంధీ రోడ్ మీదికి వస్తె మనం రావాల్సిందే,రాహుల్ గాంధీ కాంగ్రెస్ కార్యకర్తలకుయజమాని..ఆయనకు సమస్య రానిస్తమా,రాహుల్ గాంధీ ప్రధాన అయ్యే వరకు మన పోరాటం... మన ఆరాటం కొనసాగుతుంది.,రాహుల్ గాంధీ కోసం కాంగ్రెస్ కార్యకర్తలు అందరం సిద్దంగా ఉంటాం ధర్మేంద్ర ప్రధా న్ రాజీనామా చేయడం బీజేపీ కి ఒక గుణపాఠం

జెట్టి కుసుం కుమార్ ఏఐసిసి సెక్రటరీ కామెంట్స్...

ఏఐసిసి పిలుపునిచ్చిన కార్యక్రమాల కంటే ఎక్కువగా జగ్గారెడ్డి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు,రాహుల్ గాంధీ కుటుంబం దేశ కోసం త్యాగం చేసిన కుటుంబం,లాల్ బహదూర్ శాస్త్రి రైల్ ప్రమాదం జరిగితే ఎవరు డిమాండ్ చేయకముందే,రైల్వే మంత్రిగా రాజీనామా చేశారు,మాధవ్ రావ్ సింధియా విమాన ప్రమాదం జరిగితే పౌర విమానయాన శాఖ మంత్రి గా రాజీనామా చేశారు,అది కాంగ్రెస్ పార్టీ చరిత్ర అని అన్నారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలు సేవాభావాన్ని పెంచుకోవాలి
## సామాజికవేత్త బిజెపి నాయకుడు శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైద్రాబాద్ జులై 25 ; ప్రజలు కుల మత ప్రాంత రాజకీయ పార్టీలకు అతీతంగా సేవా భావం పెంచుకోవాలని అప్పుడే సమాజంలో ప్రజలందరూ ఐకమత్యంతో సంతోషంతో జీవిస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని సామాజికవేత్త బిజెపి సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు మాతృదేవోభవ సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేబీ శ్రీధర్ మరియు ప్రతినిధి బృందం కూకట్పల్లిలోని శ్రీనివాస్ రెడ్డి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి వారిని ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాతృ ప్రేమ యొక్క గొప్పతనాన్ని ప్రచారం చేస్తున్న మాతృదేవోభవ సత్సంగ్ సభ్యులను అభినందించారు ముఖ్యంగా యువత మాతృ ప్రేమ యొక్క గొప్పతనాన్ని తెలుసుకోవాలని మాతృ ప్రేమతో కుటుంబంలోనే కాదు సమాజంలో సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు మాతృదేవోభవ సత్సంగ్ చేపట్టే కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు కార్యక్రమంలో సామాజిక వేత్త పూర్వ పోలీసు అధికారి శ్రీమతి ప్రేమ రెడ్డి దంపతులు సత్సంగ్ సభ్యులు రామ్ చందర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## సర్వేనెంబర్ 1580 ఏ లోని ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని మినీ స్టేడియానికి కేటాయించాలి.

బద్వేల్ మండలం చెన్నంపల్లి బయన పల్లె ఇమడాపురం రెవెన్యూ గ్రామాల పరిధిలోని ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ప్రజలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని మరియు చెన్నంపల్లి గ్రామ పొలం 1580ఎ లోని ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని మినీ స్టేడియానికి కేటాయించాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం బద్వేల్ మండల తహసిల్దార్ తిరుమల బాబుకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, బద్వేలు కడప రోడ్డుకు ఇరువైపులా ప్రధాన రహదారి వెంబడి ఉన్న చెన్నంపల్లి బయనపల్లె ఇమడాపురం రెవెన్యూ గ్రామాల పరిధిలోని అత్యంత విలువైన ప్రభుత్వ భూములు, రస్తాలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఓ ముఖ్య నేత అనుచరులైన కొంతమంది ఆక్రమించుకుని ఫెన్సింగ్లు వేసుకుని కోట్లాది రూపాయలకు అమ్మకాలు చేస్తున్నారని తక్షణమే వాటన్నింటినీ స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు వేసి ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసి ఆ భూములను ప్రభుత్వ ప్రజా అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే బద్వేలు పట్టణానికి అతి చేరువలో ఉన్న 1580 ఏ లోని 5 ఎకరాల ప్రభుత్వ భూమిని బద్వేల్ ప్రజల భవిష్యత్తు అవసరాల కోసం మినీ స్టేడియానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. చెన్నంపల్లి గ్రామ పొలంలోని 1567ఎ, 1569ఎ,1580బి, 1753,1755,1569బి బయినపల్లి పరిధిలోని 22,23ఎ, 24ఎ, 26బి, 32బి, 33 ఇమడాపురం పరిధిలోని సర్వేనెంబర్ 74 బి లోని ఎకరా 24 సెంట్లు, 148 బి లో అక్రమంగా ఆన్లైన్ చేయించుకున్న ఎకరా 30 సెంట్లు భూములలో హెచ్చరిక బోర్డులు వేసి కాపాడాలని ఆయన కోరారు. బద్వేల్ ప్రాంతంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వారు ఇష్టారీతిన ఆక్రమణలకు అక్రమాలకు పాల్పడుతున్నారని, అధికారుల ఆదేశాలను సైతం లెక్కచేయడం లేదని ఇది పరిపాటిగా మారిందని తక్షణమే ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి మీ ఆక్రమణ పరంపరకు అడ్డుకట్ట వేయాలని ఇలాగే కొనసాగితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కే జకరయ్య నియోజకవర్గ కమిటీ సభ్యులు విజయరావు, రామరాజు, బాబు, సంజీవ రాయుడు, మహబూబ్ బాషా, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బడిపిల్లలకు పుస్తకాలు పంపిణీ చేసిన మెట్టు సాయికుమార్





**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** శనివారంనాడు 25 జులై నాడు గోషామహల్ నియోజకవర్గం గంఫౌండ్రి డివిజన్ బడి చౌడీ లోని twinkle star ఫౌండషన్ చైర్మన్ గోపి యాదవ్ ఆధ్వర్యంలో బడి పిల్లలకు ఉచితంగా నోట్ బుక్స్ పంపిని కార్యక్రమానికి మెట్టు సాయి కుమార్ చైర్మన్ ఫిషరీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ముఖ్య అధితిగా విచ్చేసి పంపిని చేసిన సందర్బంగా చంద్ర మోహన్ యాదవ్ కాంటెస్టెడ్ కార్పొరేటర్, బద్దం సతీష్ గౌడ్ జనరల్ సెక్రటరీ ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్, చేతన్‌కుమార్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, వినోద్ కుమార్ సీనియర్ కాంగ్రెస్ లీడర్, రోజీ ,కనకయ్య,గౌస్ ,చింటు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెంటికి చెడ్డా చెవిరెడ్డి

తిరుపతి జూలై 25, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఒకప్పుడు అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా, నమ్మినబంటుగా చక్రం తిప్పిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు తీవ్ర అంధకారంలో పడినట్లే కనిపిస్తోంది. పార్టీలో ఆయనకు దక్కిన ప్రాధాన్యత, హోదా మరే నాయకుడికీ లభించలేదనడంలో సందేహం లేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా ఒంగోలు లోక్‌సభ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు అప్పగించడమే కాకుండా, ఎంపీ టికెట్ ఇచ్చి మరీ బరిలోకి దించారు. కానీ, మారిన పరిస్థితులు, అంతర్గతంగా బయటపడిన సంచలన నిజాలు జగన్ మోహన్ రెడ్డికి తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయని, ఫలితంగానే చెవిరెడ్డిని పార్టీ యాజమాన్యం పూర్తిగా పక్కన పెట్టేసిందనే చర్చ వైసీపీ వర్గాల్లో తీవ్రంగా సాగుతోంది.జగన్ ఆగ్రహానికి ప్రధాన కారణం లిక్కర్ స్కామ్ వ్యవహారమేనని పార్టీ వర్గాలు నమ్ముతున్నాయి. పాలనలో మద్యం విధానం రూపకల్పన, డిస్టిలరీల వ్యవహారాల్లో చెవిరెడ్డి కీలక పాత్ర పోషించారని, అయితే ఆ ప్రక్రియలో జగన్ రెడ్డికి, పార్టీకి తెలియకుండా పెద్ద ఎత్తున నిధులు మళ్లించి, తన స్వప్రయోజనాల కోసం డబ్బులు మిగుల్చుకున్నారని సిట్ లెక్కల్లో తేలింది. మద్యం కుంభకోణంలో సొంత మనుషులే తనను మోసం చేశారనే క్లారిటీ జగన్‌కు రావడంతో, చెవిరెడ్డి పట్ల ఉన్న నమ్మకం కాస్తా తీవ్ర అసంతృప్తిగా మారింది. ఆ దెబ్బతోనే ఆయనకు జగన్ దగ్గర ఎంట్రీ బంద్ అయిందనే వార్తలు వినిపిస్తున్నాయి.ఒకప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లో నిత్యం దర్శనమిచ్చే చెవిరెడ్డి, ఇప్పుడు కనీసం జగన్ పక్కన నిలబడే అర్హతను కూడా కోల్పోయినట్లయింది. గత కొన్ని నెలలుగా జగన్ మీడియా సమావేశాల్లో కానీ, ముఖ్యమైన పార్టీ సమావేశాల్లో కానీ ఆయనెక్కడా కనిపించక పోవడం ఈ ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది. వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డికి తిరిగి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున టికెట్ దక్కే అవకాశాలు దాదాపు శూన్యమని పొలిటికల్ కారిడార్లో టాక్ నడుస్తోంది. పరిస్థితిని బట్టి చంద్రగిరి నియోజకవర్గం నుంచి ఆయన కుమారుడు మోహిత్ రెడ్డికి ఏమైనా అవకాశం కల్పిస్తారా అంటే.. అప్పటివరకు ఉండే రాజకీయ సమీకరణాలు, జగన్ ఆలోచనా విధానాన్ని బట్టి అది కూడా అనుమానాస్పదమేనని తెలుస్తోంది.సజ్జల వర్గం గనుక చెవిరెడ్డిని మరింతగా టార్గెట్ చేస్తే, ఆయన ఇక వైసీపీలో మనుగడ సాగించడం అసాధ్యమనే భావనకు పార్టీ శ్రేణులు వస్తున్నాయి. జగన్ దయ కోల్పోయిన నాయకుడికి వైసీపీలో భవిష్యత్తు లేదనేది బహిరంగ సత్యం. కష్టకాలంలో పార్టీకి అండగా ఉండాల్సిన నాయకుడే నమ్మకద్రోహం' చేశాడనే ముద్ర పడటంతో, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రాజకీయ జీవితానికి గండం తెచ్చి పెట్టింది. సజ్జల వ్యూహాలకు బలైపోతున్న చెవి రెడ్డి, వైసీపీని వీడి వేరే దారి చూసుకుంటారా లేక రాజకీయంగా మౌనం పాటిస్తూ కాలానికి అనేది వేచి చూడాల్సిందే. ఏది ఏమైనా, వైఎస్ జగన్ సొంత గుడారంలో చెవిరెడ్డి చాప్టర్ దాదాపు ముగింపునకు వచ్చిందనేదిఎక్కువమందినమ్ముతున్న అంశం.

# ప్రత్యక్ష ఎన్నికల దిశగా అడుగులు

విజయవాడ, జూలై 25, ఆంధ్రప్రదేశ్ రాజకీయం త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఓ భారీ మలుపు తిరగబోతోంది. స్థానిక సంస్థల్లో ఏళ్ల తరబడి శాపంగా మారిన క్యాంప్ రాజకీయాలు , బేరసారాలు, బెదిరింపులకు శాశ్వతంగా చరమగీతం పాడేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత కీలకమైన ప్రజాస్వామ్య సంస్కరణకు రూపకల్పన చేస్తున్నారు. మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా పరిషత్ ( చైర్మన్లు, మండల పరిషత్ అధ్యక్షులను ప్రజలే నేరుగా ఎన్నుకునే ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. పరోక్ష ఎన్నికల పేరిట స్థానిక సంస్థల్లో సాగుతున్న ప్రజాస్వామ్య హననాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లు భావిస్తున్నారు.పరోక్ష ఎన్నికల విధానంలో గ్రామ, వార్డు స్థాయి ప్రజాప్రతినిధులను ఎన్నుకున్న తర్వాత, వారు తమ నాయకుడిని ఎన్నుకుంటారు. ఈ క్రమంలో అధికార బలం, ఆర్థిక ప్రాబల్యం, పోలీసు వ్యవస్థ దుర్వినియోగం పీక్ స్టేజ్‌కు చేరుకుంటాయి. మెజార్టీ రాని అధికార పార్టీలు కూడా ప్రతిపక్షాల నుంచి గెలిచిన ప్రజాప్రతినిధులను రిసార్టులకు తరలించడం, క్యాంపులు నిర్వహించడం, రకరకాల ఒత్తిళ్లకు గురిచేసి తమవైపు తిప్పుకోవడం ఆనవాయితీగా మారింది. చివరికి ప్రజల తీర్పు ఒకటైతే, పీఠంపై కూర్చునేది మరొకరయ్యే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ అక్రమ సంస్కృతికి అడ్డుకట్ట వేయాలంటే ప్రజల చేతికే నేరుగా ఓటు హక్కు ఇవ్వడమే ఏకైక మార్గమని భావిస్తున్నారు.సాధారణంగా ఏ అధికార పార్టీ కూడా ఇటువంటి ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తీసుకురావడానికి సాహసించదు. ఎందుకంటే, పరోక్ష విధానం ఉంటే వార్డుల్లో సీట్లు తగ్గినా, సర్పంచ్ లేదా కౌన్సిలర్లను లొంగదీసుకుని మున్సిపాలిటీలు, జడ్పీలను కైవసం చేసుకునే వెసులుబాటు అధికారంలో ఉన్న పార్టీకి ఉంటుంది. అయితే, అక్రమ మార్గాల్లో పీఠాలను దక్కించుకునే సంస్కృతి కంటే, పారదర్శకమైన ప్రజా తీర్పుకే ప్రాధాన్యత ఇవ్వాలనేది సీఎం చంద్రబాబు వ్యూహంగా కనిపిస్తోంది. పరోక్ష ఎన్నికల్లో జరిగే కోట్లాది రూపాయల బేరసారాలకు స్వస్తి పలికితే, స్థానిక సంస్థల్లో జవాబుదారీతనం పెరుగుతుందనేది నమ్మకం.గత చరిత్రను పరిశీలిస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడం ఇదే మొదటిసారి కాదు. 1987లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హయాంలో తొలిసారిగా మున్సిపల్ చైర్మన్లు, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులకు నేరుగా ప్రజలే ఓటు వేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తర్వాత 2000వ దశకం ప్రారంభంలో చంద్రబాబు హయాంలోనూ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను నేరుగా ఎన్నుకునే పద్ధతి నడిచింది. అయితే, కౌన్సిల్‌లో ఒక పార్టీకి మెజార్టీ ఉండి, మేయర్, చైర్మన్ మరొక పార్టీకి చెందినవారు గెలిస్తే పాలనలో ప్రతిష్టంభన ఏర్పడుతోందనే నెపంతో తర్వాతి ప్రభుత్వాలు మళ్లీ పరోక్ష విధానానికే మొగ్గు చూపాయి.చట్టపరమైన కోణంలో చూస్తే.. భారత రాజ్యాంగంలోని 243అ పంచాయతీలు, 243ఖ మున్సిపాలిటీలు నిబంధనల ప్రకారం స్థానిక సంస్థల అధ్యక్షుల ఎన్నికల విధానాన్ని నిర్ణయించే సర్వాధికారాలు రాష్ట్ర శాసనసభలకే ఉన్నాయి. దీనికోసం ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం-1994 , అలాగే ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం-1965 , మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం-1994లకు అసెంబ్లీలో సవరణలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత కూటమికి అసెంబ్లీలో అత్యధిక మెజార్టీ ఉన్నందున, ఈ చట్టసవరణ చేయడం ప్రభుత్వానికి సునాయాసమైన ప్రక్రియే కానుంది. ఈ ప్రత్యక్ష విధానం అమల్లోకి వస్తే రాజకీయ పార్టీలపై, స్థానిక నాయకత్వంపై తీవ్ర ప్రభావం పడనుంది. కేవలం డబ్బు సంచులతో కౌన్సిలర్లను కొనుగోలు చేసే ధనస్వామ్య నాయకులకు కాలం చెల్లి, ప్రజల్లో మంచి గుర్తింపు, ఆమోదయోగ్యత ఉన్న నాయకులకే పార్టీలు బీ-ఫారాలు ఇవ్వాల్సి వస్తుంది. ఒక వేళ కౌన్సిల్‌లో ప్రతిపక్షాల బలం ఎక్కువగా ఉన్నా, ప్రజల చేత నేరుగా ఎన్నుకోబడిన మేయర్, చైర్మన్ బడ్జెట్ ఆమోదం, పాలనా నిర్ణయాల్లో అందరినీ సమన్వయం చేసుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. అధికారంలో ఉండి కూడా పరోక్ష లబ్ధిని వదులుకుని ప్రత్యక్ష ఎన్నికలకు వెళ్లడం అనేది ఒక రాజకీయ తెగువగా అభివర్ణించవచ్చు. ఈ ప్రతిపాదన గనుక చట్టరూపం దాల్చి అమల్లోకి వస్తే, భవిష్యత్తులో దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆంధ్రప్రదేశ్ స్థానిక పాలనలో మార్గదర్శిగా నిలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి

# ఆర్గానిక్ బాటలో జగన్

ఏలూరు జూలై 25,డిజిటల్ ప్రపంచంలో పెయిడ్ ట్రాఫిక్ కోసం చాలా మంది డబ్బులు కడుతూంటారు. తమ పోస్టులకు రీచ్ రావడానికి.. తాము చేసే ప్రకటనల్ని ఎక్కువ మంది చూడటానికి.. తమ వీడియోలను ఎక్కువ మంది చూడటానికి డబ్బులు కడుతూంటారు. అయితే నిజానికి అలా కట్టడం వల్ల ఎక్కువ మంది చూడరు. నెంబర్స్ మాత్రమే కనిపిస్తాయి. అంటే ప్రయోజనం కనిపిస్తుంది కానీ.. పనికి రాదు. జగన్ రెడ్డి కూడా అదే మార్క్ రాజకీయాలు చేస్తున్నారు. పూర్తిగా పెయిన్ పాలిటిక్స్ చేస్తూ?ఆర్గానిక్ బాటను మర్చిపోయారు.రాజకీయ నాయకుడు ఏదైనా కార్యక్రమం చేస్తే ప్రజల భాగస్వామ్యం ఉండేలా చేసుకోవాలి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన, సహజమైన సమస్యలను పట్టుకుని బాధితుల మధ్యకు వెళ్తున్నప్పుడు వారిని కలవాలి. కానీ జగన్ రెడ్డి ఆ సమస్య పేరుతో తాను ఓ డ్రామా సృష్టించుకుని దానిలో నటించి వెళ్లిపోతారు. సమస్య ఏదైనా సరే, దాని చుట్టూ కొంతమంది నేతలతో ఒక ఆర్టిఫిషియల్ డ్రామా నడిపిస్తే చాలు రాజకీయం చేయవచ్చని జగన్ భావిస్తున్నారని, కానీ ఈ వ్యూహం ప్రజల్లో ఆయన నమ్మకాన్ని మరింత దిగజారుస్తోంది.ఇటీవల అక్వా రైతులు తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారంటూ వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున హడావుడి చేసింది. అయితే, క్షేత్రస్థాయిలో అక్వా రైతుల వద్దకు వెళ్లి వారి బాధలు వినకుండా.. ఫేక్ సభ పెట్టి .. పార్టీ నేతలతో మాట్లాడి డ్రామా పాలిటిక్స్ చేశారు. ఈ పోరాటం ఏ ఒక్క అసలైన అక్వా రైతునూ కదిలించలేకపోయింది. ఇప్పుడు అదే తరహా మైండ్ గేమ్ పొగాకు రైతుల విషయంలోనూ పునరావృతమవుతోంది. అసలైన రైతులతో కనెక్ట్ కాకుండా, కేవలం కెమెరాల ముందూ, ముందస్తుగా సిద్ధం చేసిన స్క్రిప్ట్‌ల చుట్టూ రాజకీయాలు నడపడం వల్ల ప్రతిపక్షంగా సాధించే ప్రయోజనమేమీ లేకుండా పోతోంది.ఈ శైలి వెనుక జగన్ ఎదుర్కొంటున్న ఓ రకమైన ఆత్మన్యూనతా భావం ఉంది. తాను బయటకు వెళ్తే జనాలు రారేమో, భద్రత లేదా ఆదరణ విషయంలో వ్యతిరేక సంకేతాలు వెళ్తాయేమో అనే ముందస్తు భయంతోనే ఆయన కృత్రిమ వాతావరణాన్ని, సొంత పార్టీ క్యాడర్‌తో సభలను ఏర్పాటు చేసుకుని రాజకీయం మమేకం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రజాకర్షణ ఉన్న నాయకుడిగా పేరొందిన జగన్.. ఇలా ఆర్టిఫిషియల్ పరిమితులకు పరిమితం కావడం వెనుక సజ్జల రామకృష్ణారెడ్డి వంటి సలహాదారుల బ్రెయిన్ వాష్ ప్రభావం చాలా ఉందనేది సొంత పార్టీ నేతల ఆవేదన. కానీ జగన్ రాజకీయం అంటే డ్రామాలే అని గట్టిగా నమ్ముతున్నారు.

# 'మీభూమి బ్లాక్ చెయిన్'

విజయవాడ జూలై 25,భూ రికార్డుల నిర్వహణలో సాంకేతిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో విడివిడిగా ఉన్న భూ సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకువస్తూ, రాష్ట్రంలోని భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా నిలిచే 'మీభూమి?బ్లాక్ చెయిన్' వ్యవస్థను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పుగోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ ద్వారా భూ రికార్డులు డిజిటలైజ్ అయినప్పటికీ, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో సమాచారం వేర్వేరుగా ఉండటం వల్ల డేటా వ్యత్యాసాలు, రికార్డుల్లో మార్పులను గుర్తించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా మీ భూమి?బ్లాక్ చెయిన్ వ్యవస్థను రూపొందించారు. ఔఎఅ ఆంధ్రప్రదేశ్, ఔఎఅ బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్స్ లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. ఈ వ్యవస్థలో ప్రతి భూ పార్సెల్‌కు ప్రత్యేక బ్లాక్‌చెయిన్ గుర్తింపు కల్పిస్తారు. ప్రతి లావాదేవీ టాంపర్-ప్రూఫ్, సెక్యూర్టీతో జరగనుంది. భూ రికార్డుల్లో ఎలాంటి మార్పు చేయాలన్నా ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ సేవల ద్వారానే ఇకపై సాధ్యమవుతుంది. ఒక భూ పార్సెల్‌కు సంబంధించిన అన్ని రకాల లావాదేవీలు, వాటి ప్రతి వెర్షన్ సహా శాశ్వతంగా నమోదయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దారు. ఇక ప్రతి లావాదేవీని ఏ అధికారి, ఎప్పుడు నిర్వహించారనే వివరాలు కూడా శాశ్వతంగా రికార్డుల్లో ఉంటాయి. రికార్డుల్లో ఏమైనా వ్యత్యాసం ఉంటే లావాదేవీ వెంటనే ఆగిపోయేలా వ్యవస్థను రూపొందించారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తీసుకువస్తున్న ఈ వ్యవస్థలో ప్రస్తుతం ఆటో మ్యూటేషన్, సబ్-డివిజన్, ఎక్స్‌టెంట్ కరెక్షన్ సహా ఎనిమిది పౌర సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. వ్యవసాయం, మత్స్యశాఖ, గనులు, పరిశ్రమలు, విద్యుత్ శాఖ, సీఆర్‌డీఏ, ఆర్థిక సంస్థలు వంటి విభాగాలు కూడా అవసరమైన మేరకు ఈ సమాచారాన్ని వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. మొదటి దశలో కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పుగోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలోని అస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల్లో ఈ పైలట్ ప్రాజెక్టుగా అమలుకానుంది. ఈ పైలట్ ప్రాజెక్టులో 89 రీ-సర్వే గ్రామాలు, 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ అవుతున్నాయి.

# అమర్ రాజా చుట్టూ రాజకీయం

గుంటూరు జూలై 25, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి గిగా కారిడార్లో అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ సంస్థకు చెందిన అడ్వాన్స్‌డ్ కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ విజయవంతంగా ప్రారంభమవ్వడం పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. నాలుగు దశాబ్దాలుగా చిత్తూరు నేలను కేంద్రంగా చేసుకుని ఎదిగిన ఒక స్వదేశీ దిగ్గజ సంస్థ, ఏకంగా 9,500 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మించే లిథియం-అయాన్ గిగాఫ్యాక్టరీ ప్రాజెక్టును పొరుగు రాష్ట్రానికి తరలించాల్సి రావడంపై ఏపీలో రాజకీయం ప్రారంభమయింది. ఈ పరిణామాన్ని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రంగానికి జరిగిన తీరని లోటుగా అభివర్ణిస్తూ, తెలుగుదేశం పార్టీ గతాన్ని తవ్వి తీస్తూ వైఎస్సార్‌సీపీపై తీవ్రంగా విమర్శలు చేస్తోంది. ఈ ప్రారంభోత్సవం వెనువెంటనే ఏపీ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమాల వేదికగా చేసిన ప్రకటన ఏపీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అమరరాజా సంస్థపై సాగిన రాజకీయ కక్షసాధింపు చర్యలు, వేధింపుల కారణంగానే రాష్ట్రం ఒక చారిత్రక పారిశ్రామిక అవకాశాన్ని కోల్పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమరరాజా ఛైర్మన్ గల్లా జయదేవ్ కుటుంబానికి ఏపీ సమాజం క్షమాపణలు చెప్పాల్సిన పరిస్థితిని గత ప్రభుత్వం తెచ్చిపెట్టిందని, నాటి జగన్ రెడ్డి సర్కార్ అవలంబించిన విధ్వంసకర విధానాలే ఈ ప్రాజెక్ట్ తెలంగాణ పాలమూరు రంగానికి వెళ్లడానికి కారణమని లోకేష్ తో పాటు టీడీపీ శ్రేణులు తీవ్రస్థాయిలో విమర్శలు ప్రారంభించాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమరరాజా గ్రూప్‌ను రాజకీయ లక్ష్యంగా చేసుకుని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్న ఆరోపణలుఉన్నాయి. గల్లా జయదేవ్ టీడీపీ ఎంపీగా ఉండటంతో, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ద్వారా ప్లాంట్ల మూసివేత నోటీసులు ఇవ్వడం, విద్యుత్ , నీటి సరఫరాను అడ్డుకోవడం, కేటాయించిన 253 ఎకరాల పారిశ్రామిక భూములను రద్దు చేసేందుకు ప్రయత్నించడం వంటి చర్యలు చోటుచేసుకున్నాయి. ఈ తీవ్ర ఒత్తిళ్లు, అనిశ్చితి వాతావరణాన్ని తట్టుకోలేకనే అమరరాజా తన భవిష్యత్ విస్తరణ అయిన లిథియం-అయాన్ ఈవీ బ్యాటరీ క్లస్టర్‌ను తెలంగాణకు తరలించాల్సి వచ్చిందని పారిశ్రామిక నిపుణులు సైతం విశ్లేషిస్తున్నారు.ఈ మొత్తం వ్యవహారంలో ఒకరి నష్టం మరొకరికి లాభంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ యువతకు రావాల్సిన వేలాది ఉద్యోగాలు, రాష్ట్రానికి దక్కాల్సిన కోట్ల రూపాయల పన్ను ఆదాయం నేడు తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు దక్కాయి. తెలంగాణ ప్రభుత్వం సమకూర్చిన అనుకూల వాతావరణంతో దివిటిపల్లి వద్ద అమరరాజా తన ఆసియాలోనే అతిపెద్ద గిగాఫ్యాక్టరీల్లో ఒకదానిని సాకారం చేసుకుంటోంది. చిత్తూరు ప్రాంతంలో ఉపాధి ఆశలు అడుగంటిపోగా, పొరుగు రాష్ట్రం గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారడంపై రాయలసీమ ప్రజల్లోనూ, వ్యాపార వర్గాల్లోనూ తీవ్ర అసంతృప్తి నెలకొంది. ప్రస్తుతం ఏపీలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఈ అంశాన్ని ఒక పదునైన కేస్ స్టడీగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పక్కా వ్యూహం సిద్ధం చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవలంబించిన కక్షసాధింపు పారిశ్రామిక విధానాలు ఎవరికీ శ్రేయస్కరం కావని, దాంతో రాష్ట్ర ప్రతిష్ట ఏ విధంగా దెబ్బతిన్నదో వివరించడానికి జిల్లాల వారీగా ప్రచారానికి సిద్ధమవుతోంది. గతం గడిచిపోయినా.. అమరరాజా గ్రూప్ ఏపీలో చేపట్టబోయే ఏ ఇతర నూతన విస్తరణ ప్రాజెక్టులకైనా తమ ప్రభుత్వం ఎర్ర తివాచీ పరుస్తుందని, పూర్తి సహకారాన్ని అందిస్తుందని నారా లోకేష్ పునరుద్ఘాటించారు.

కేవలం ఒక్క అమరరాజాయే కాకుండా, గతంలో రాష్ట్రం నుంచి బయటకు వెళ్లిపోయిన సుజలాన్, ఫాక్స్‌కాన్ అసెంబ్లీ యూనిట్లు, ఇతర చిన్న-తరహా పరిశ్రమల నిర్వాహకులకు మళ్లీ భరోసా కల్పిస్తూ ఏపీలో పారిశ్రామిక పునరుజ్జీవనానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇది 'జగన్ మార్క్ పాలనా వైఫల్యం'పై పోరాటానికి టీడీపీకి దొరికిన బలమైన ఆయుధంగా మారింది. రాబోయే రోజుల్లో ఈ పారిశ్రామిక రాజకీయం ఏపీలో మరింత వేడెక్కడం ఖాయంగా కనిపిస్తోంది.

# పంట కాలువలో ముగ్గురు దుర్మరణం

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ

రామచంద్రపురం మండలం వెంకటపాలెం గ్రామ సమీపంలోని పంట కాలువలో స్నానానికి దిగిన ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది.ఈ ఘటనలో కనికెళ్ళ రంజిత్ కుమార్(15), బొక్క వీరేంద్ర(18), వేమన పావని(15) మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.మృతులు కపిలేశ్వరపురం మండలం అంగర, పడమర ఖండ్రిక, తాతపూడి గ్రామాలకు చెందినవారు. వీరు అక్కాచెల్లెళ్ల పిల్లలు కాగా ప్రస్తుతం హైదరాబాద్ లో నివసిస్తున్నారు. రామచంద్రపురం మండలం వెలంపాలెం గ్రామంలోని అమ్మ ఇంటికి నిన్న జరిగిన తాతయ్య సంస్కార కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చారు. ఈరోజు సమీపంలోని వెంకటపాలెం పంట కాలువలో స్నానానికి వెళ్లి ఈ ప్రమాదానికి గురయ్యారు.ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు మంత్రి సుభాష్ తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.ఈ ఘటనతో వెలంపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# టాటాసుమోపై విరిగిపడ్డ కొండచరియలు..

# 13 మంది మృతి ..

.హిమాచల్ ప్రదేశ్‌లోని లాహౌల్-స్పితి జిల్లాలో శుక్రవారం ఘోర ప్రమాదం జరిగింది. ఉదయ్‌పూర్-కిలార్ రహదారిపై 'కదూ నాలా' వద్ద భారీ కొండచరియలు విరిగిపడటంతో, మార్గమధ్యంలో వెళ్తున్న ఒక టాటా సుమో ధ్వంసమైంది. ఈ వాహనంలో ప్రయాణిస్తున్న 15 మందిలో ఇద్దరు సురక్షితంగా బయటపడగా, మిగిలిన 13 మంది మరణించినట్లు స్థానిక మీడియా నివేదించింది. ఎమ్మెల్యే జనక్ రాజ్ ఈ దుర్ఘటనను ధ్రువీకరించారు. ప్రమాదం జరిగిన వెంటనే వాహనంలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి

# నీట్ ను పట్టించుకోని తెలుగు ప్రాంతీయ పార్టీలు

హైదరాబాద్, జూలై 25, దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ, కేంద్ర ప్రభుత్వ విద్యారంగ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు మిన్నంటుతున్నా, తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ప్రాంతీయ పార్టీలు బీఆర్ఎస్ , వైఎస్సార్సీపీ అనూహ్యంగా మౌనం వహించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ , వివిధ విద్యార్థి సంఘాలు రోడ్లెక్కి ఆందోళనలు నిర్వహిస్తున్నప్పటికీ, ఈ రెండు ప్రాంతీయ పార్టీలు మాత్రం క్రియాశీలక పోరాటాలకు దూరంగా ఉంటున్నాయి. యువత , విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత సున్నితమైన అంశంపై ఈ రెండు పార్టీల మౌనం రాజకీయంగా పలు అనుమానాలకు తావిస్తోంది.సాధారణంగా ప్రతిపక్షాలకు యువత, విద్యార్థి వర్గాల మద్దతును పొందేందుకు ఇలాంటి జాతీయ స్థాయి వివాదాలు ఒక పెద్ద ఆయుధంగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా బీజేపీ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రాంతీయ పార్టీలు ముందంజలో ఉండాలి. కానీ, తెలంగాణలో బీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్లో వైఎస్సార్సీపీ రెండూ కూడా జాతీయ స్థాయిలో విపక్షాల కూటమి పిలుపునిచ్చిన నిరసనలకు భౌతికంగా, ఉధృతంగా మద్దతు తెలపకపోవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహంతో పాటు కేంద్రం పట్ల ఉన్న భయాందోళనలే కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందిగ్ధ పరిస్థితికి ప్రధాన కారణం కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ నాయకత్వం పట్ల ఈ పార్టీలకున్న వినూత్నమైన అభద్రత. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ గత లోక్‌సభ ఎన్నికల తర్వాత, అసెంబ్లీ ఓటమి అనంతరం తన రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు బీజేపీతో అనధికారికంగా ఒక వ్యూహాత్మక శాంతి ని పాటిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. కేంద్రాన్ని లేదా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులను నేరుగా టార్గెట్ చేస్తే టీఎంసీ లాంటి పరిస్థితులు రావొచ్చని సందేహిస్తున్నారు. అటు ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్సీపీ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలో ఉంది.

గత ఐదేళ్ల పాలనపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం పలు విచారణలకు ఆదేశిస్తున్న తరుణంలో, కేంద్రంలోని బీజేపీ పెద్దల ఆగ్రహానికి గురైతే పార్టీ మరింత తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్సీపీ భావిస్తోంది. అందువల్లనే, కేంద్ర విద్యాశాఖ , మోదీ ప్రభుత్వాన్ని విమర్శించే విషయంలో వైఎస్సార్సీపీ చాలా అప్రమత్తంగా, పరిమిత వ్యాఖ్యలకే పరిమితమవుతూ, వీధుల్లోకి వచ్చి పోరాడేందుకు వెనుకాడుతోంది. విద్యార్థుల భవిష్యత్తు ఎటుపోయినా పర్వాలేదు కానీ, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు మాత్రం కేంద్రాన్ని ప్రశ్నించరు అంటూ రేవంత్ రెడ్డి టార్గెట్ చేస్తుండటంతో, బీఆర్ఎస్ డిఫెన్స్‌లో పడిపోతోంది. తమ స్వయంకృత అపరాధాల వల్ల వచ్చిన కేసుల భయంతోనే బీఆర్ఎస్ నోరు మెదపడం లేదని కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. అందుకే మొక్కుబడిగా జంతర్, మంతర్ దగ్గర బీఆర్ఎస్వీతో నిరసనలు చేయిస్తామని ప్రకటించారు. సుదీర్ఘ కాలంలో ఈ తరహా మౌనం ప్రాంతీయ పార్టీలకు పెద్ద దెబ్బగా మారే అవకాశం ఉంది.

రాబోయే కాలంలో నిరుద్యోగిత, విద్యార్థుల సమస్యలు, రిక్రూట్‌మెంట్లు ప్రధాన రాజకీయ అంశాలుగా మారబోతున్న తరుణంలో, యువతకు అండగా నిలవాల్సిన ప్రతిపక్షాలు వెనుకడుగు వేస్తున్నాయి. ఇది కాంగ్రెస్‌కు విద్యార్థి, యువజన ఓటు బ్యాంకును మరింత బదిలీ చేసేందుకు దోహదపడుతోంది. కేంద్రంలోని బీజేపీ అగ్రనాయకత్వం పట్ల ఉన్న భయం, రాజకీయంగా వ్యూహాత్మకంగా సైలెంట్‌గా ఉండాలనే నిర్ణయం వల్లనే బీఆర్ఎస్, వైఎస్సార్సీపీలు జాతీయ స్థాయి ఆందోళనలకు దూరంగా ఉంటున్నాయి. ఈ వ్యూహం ప్రస్తుతానికి తమపై కేంద్ర సంస్థల దాడులు పడకుండా కాపాడుకోవడానికి ఉపయోగపడవచ్చు ఏమో కానీ, క్షేత్రస్థాయిలో విద్యార్థులను, యువత మద్దతు కోల్పోయే ప్రమాదాన్ని ఈ ప్రాంతీయ పార్టీలు స్వయంగా తెచ్చిపెట్టుకుంటున్నాయని ఎక్కువ మంది భావిస్తున్నారు.

# 29 నుంచ 45కు పెరగనున్న సిటీ అసెంబ్లీ సీట్లు

హైదరాబాద్, జూలై 25, తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అమల్లోకి వస్తే రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం సమూలంగా మారిపోనుంది. ప్రస్తుతం ఉన్న 119 శాసనసభ స్థానాల సంఖ్య ఏకంగా 179 వరకు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాజ్యాంగ నిబంధనలు, జనాభా లెక్కల ప్రాతిపదికన ప్రతి నియోజకవర్గానికి సగటున 1.95 లక్షల జనాభాను ప్రామాణికంగా తీసుకుంటే.. ఈ ప్రక్రియలో అత్యధికంగా లబ్ధి పొందేది, సీట్లను అదనంగా సాధించుకునేది గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఉండే మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలే కానున్నాయి.ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాలు విపరీతంగా విస్తరించడం వల్ల గ్రామీణ ప్రాంతాలు, ఇతర జిల్లాల నుంచి నగరానికి వలసలు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్ వంటి నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య ఆరు నుంచి ఏడు లక్షలు దాటిపోయింది. మిగతా జిల్లాల్లోని ఒక సాధారణ నియోజకవర్గంలో 2 నుంచి 2.5 లక్షల ఓటర్లు ఉంటే, హైదరాబాద్ అర్బన్ కారిడార్‌లోని ఒక్కో స్థానంలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండాల్సినంత జనాభా కేంద్రీకృతమైంది. ఈ వ్యత్యాసాన్ని సరిదిద్దడమే డిలిమిటేషన్ ప్రధాన లక్ష్యం కానుంది.అంచనాల ప్రకారం.. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల ఉమ్మడి అసెంబ్లీ స్థానాల సంఖ్య ప్రస్తుతం ఉన్న 29 నుంచి ఏకంగా 45కిపైగా పెరిగే అవకాశముంది.

పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, మేడ్చల్, కూకట్‌పల్లి, మహేశ్వరం వంటి అతిపెద్ద నియోజకవర్గాలను రెండు లేదా మూడు కొత్త సీట్లుగా విభజిస్తారు. దీనివల్ల కేవలం గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల అర్బన్ పరిధిలోనే దాదాపు 16 నుంచి 20 కొత్త అసెంబ్లీ స్థానాలు పుట్టుకొస్తాయి. అంటే, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా గ్రామీణ ప్రాంతాల కంటే ఈ గ్రేటర్ బెల్ట్ సీట్లే అత్యంత కీలకం కానున్నాయి.ఈ స్థానాల పెంపు ఏ పార్టీకి రాజకీయంగా అడ్వాంటేజ్ ఇస్తుందనేది ఇప్పుడు అసలు సిసలైన చర్చ. నగర ఓటర్లలో మధ్యతరగతి, ఐటీ ఉద్యోగులు, ఆంధ్రా మూలాలున్న సెటిలర్లు, ఉత్తరాది వలసదారులు ఎక్కువగా ఉంటారు. చారిత్రాత్మకంగా గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు మైగ్రెంట్స్ ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో బిజెపి , బిఆర్ఎస్ పార్టీలకు బలమైన ఓటు బ్యాంక్ ఉంది. డిలిమిటేషన్ వల్ల నగర సీట్లు పెరిగితే అర్బన్ క్లాస్, సెటిలర్ ఓటర్ల ప్రభావం మరింత పెరిగి బీజేపీ, బీఆర్ఎస్‌లకు కలిసివచ్చే అవకాశాలు ఎక్కువ . మరోవైపు, కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం గ్రామీణ తెలంగాణలో అత్యంత బలంగా ఉండి, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తక్కువ స్థానాలను కలిగి ఉంది. కాబట్టి అర్బన్ సీట్లు భారీగా పెరిగితే కాంగ్రెస్ తన రాజకీయ వ్యూహాన్ని మార్చుకోవాల్సి వస్తుంది. కాంగ్రెస్ గ్రామీణ ఓటు బ్యాంకును మాత్రమే నమ్ముకుంటే సరిపోదని, నగర నియోజకవర్గాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఈ కొత్త సమీకరణాలు స్పష్టం చేస్తున్నాయి. రూరల్ నియోజకవర్గాల్లో కూడా జనాభా ప్రకారం కొత్త స్థానాలు ఏర్పడతాయి కాబట్టి అక్కడ తులనాత్మకంగా కాంగ్రెస్‌కు పట్టు సాధించే వెసులుబాటు కూడా ఉంటుంది.

రాబోయే డిలిమిటేషన్ తెలంగాణ పొలిటికల్ పవర్ సెంటర్‌ను రూరల్ కారిడార్ నుంచి అర్బన్ కారిడార్‌కు మళ్లించబోతోంది. ఏ పార్టీ అయితే గ్రేటర్ హైదరాబాద్ విస్తరిస్తున్న నూతన నియోజకవర్గాల్లో పట్టు సాధిస్తుందో, ఆ పార్టీకే రాష్ట్రంలో అధికార పీఠం దక్కే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. సామాజిక సమీకరణాలు, వలసదారుల ప్రభావం, ఐటీ-రియల్ ఎస్టేట్ రంగాల విస్తరణే రేపటి తెలంగాణ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి.

## మోదీ స్వాగతంలో 13 వేల మందితో థింసా నృత్యం

విజయవాడ ఆగస్టు 1న భోగాపురం ఎయిర్పోర్టును ప్రధాని మోదీ ప్రారంభించనున్న విషయం తెలిసిందే. ప్రధాని మోదీకి స్వాగతంగా 13 వేల మందితో దేశంలోనే అతిపెద్ద థింసా నృత్య ప్రదర్శన నిర్వహించాలని అధికారులను మంత్రి లోకేశ్ సూచించారు. సభకు వచ్చే వారికి అల్పాహారం, భోజనం, తాగునీరు ఏర్పాటు చేయాలని అన్నారు. మరోవైపు ఎయిర్పోర్టు లోపల ఉత్తరాంధ్ర సంస్కృతి కనిపించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# పట్నం సోదరులకు పలువురి పరామర్శ

హైదరాబాద్ మాతృ యోగానికి గురైన పట్నం సోదరులను పలువురు పరామర్శించారు. మాజీ మంత్రి, శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, కోడంగల్ మాజీ ఎంఎల్ఏ పట్నం నరేందర్ రెడ్డి ల మాతృ మూర్తి పట్నం రుక్కమ్మ మృతి చెందిన నేపథ్యంలో బంజారాహిల్స్ లోని మహేందర్ రెడ్డి నివాసంలో దుర్గమ్మ పార్థివ దేహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిల్ల శ్రీధర బాబు లు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అలాగే ఎంఎల్ఏలు మనోహర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ గడ్డం రంజీత్ రెడ్డి, ఎంఎల్సీలు ఏవీఎన్ రెడ్డి,దామోదర్ రెడ్డి మాజీ మంత్రి ఏ. చంద్రశేఖర్, మాజీ ఎంఎల్ఏ లు కేఎస్ రత్నం, కేఎల్ ఆర్, జైపాల్ యాదవ్, వికారాబాద్,మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారాసింగ్, వజ్రేష్ యాదవ్, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లు సత్యనారాయణ రెడ్డి, కాలే శ్రీకాంత్, మహిపాల్, రవి గౌడ్ తదితరులు పట్నం సోదరులను పరామర్శించారు.

# రాజాసింగ్ కు దారేదీ...



హైదరాబాద్, జూలై 25,తెలంగాణ రాజకీయాల్లో కరడుగట్టిన హిందూత్వ బ్రాండ్‌గా గుర్తింపు పొందిన గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ భవిష్యత్తు ఇప్పుడు సస్పెన్స్‌లో ఉంది. గతంలో రాష్ట్ర నాయకత్వ ఎంపికతో పాటు పలు అంశాలపై తీవ్ర అసంతృప్తి చెంది ఆవేశంతో బీజేపీకి రాజీనామా చేసిన రాజాసింగ్‌కు, క్రమశిక్షణే ప్రాతిపదికగా పనిచేసే కమలం పార్టీ అధిష్ఠానం షాక్ ఇచ్చింది. ఆయన రాజీనామాను ఆమోదిస్తూ కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకోవడం, ఆయన లేవనెత్తిన అంశాలు అసంబద్ధమైనవి అని తేల్చిచెప్పడం తెలంగాణ బీజేపీలో ఆయన శకం ముగిసిందనే సంకేతాలను స్పష్టంగా పంపింది.రాజీనామా చేసిన తొలినాళ్లలో దూకుడు ప్రదర్శించిన రాజాసింగ్‌కు, ఆ తర్వాతి పరిణామాలతో బీజేపీని వీడడం ఎంతటి ప్రతికూల నిర్ణయమో బోధపడింది. తనకున్న హిందూత్వ రాజకీయ ఐడెంటిటీ బీజేపీతోనే ముడిపడి ఉందనే సత్యాన్ని గ్రహించిన ఆయన, మళ్లీ పార్టీలోకి చేరేందుకు రకరకాల మార్గాల్లో తీవ్రమైన లాబీయింగ్ ప్రారంభించారు. కేంద్ర పెద్దలకు విజ్ఞప్తులు పంపడం, అధిష్ఠానం దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం వంటివి చేశారు. అయితే, ఎప్పటికప్పుడు అధిష్ఠానానికి, రాష్ట్ర నాయకత్వానికి ఎదురు తిరిగి శ్రుతిమించిన వ్యాఖ్యలు చేసే రాజాసింగ్‌ను మళ్లీ వెనక్కి తీసుకునేందుకు బీజేపీ జాతీయ నాయకత్వం ఏమాత్రం సుముఖంగా లేదని స్పష్టమవుతోంది.ఇదే సమయంలో, బీజేపీ తనను పట్టించుకోకపోవడంతో తీవ్ర నిరాశకు గురైన రాజాసింగ్.. తన అసహనాన్ని శాపనార్థాల రూపంలో వెళ్లగక్కుతున్నారు. రాష్ట్రంలో బీజేపీ బాగుపడదని, పార్టీని నాశనం చేస్తున్నారని విమర్శిస్తూనే మరోవైపు లోపాయికారీగా మళ్లీ ప్రవేశం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. తెలంగాణలో గోషామహల్ నియోజకవర్గం మినహా రాష్ట్రవ్యాప్తంగా సొంత బలం మీద ఓట్లను ప్రభావితం చేసే స్థాయిలో రాజాసింగ్‌కు వ్యక్తిగత ఓటు బ్యాంక్, పార్టీ కేడర్ మద్దతు లేకపోవడం ఆయనకున్న అతిపెద్ద బలహీనత. ఇక్కడ ఆయనకు మరో ప్రాంతీయ పార్టీలో చేరే అవకాశం కూడా లేదు. ఈ క్రమంలోనే రాజాసింగ్ తన రాజకీయ దృష్టిని తెలంగాణ దాటి ఇతర రాష్ట్రాల వైపు మళ్లిస్తున్నట్లు రాజకీయ భావిస్తున్నారు. నేను తెలంగాణలో రాజకీయాలు చేయకపోయినా.. దేశంలో హిందూత్వ కోసం పనిచేస్తాను అని చెబుతున్నారు. తెలంగాణలో కంటే రాజాసింగ్‌కు పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఉత్తరప్రదే వంటి ఉత్తరాది రాష్ట్రాల్లోని హిందూత్వ వర్గాల్లో విస్తృతమైన పాపులారిటీ, క్రియాశీల ఫాలోయింగ్ ఉంది. సకల్ హిందూ సమాజ్ నిర్వహించే పలు సభల్లో ఆయన ప్రసంగాలకు అక్కడి తీవ్ర హిందూత్వ వర్గాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో రాజాసింగ్‌కు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. పలు వేదికలపై యోగి సిద్ధాంతాలను, బుల్డోజర్ మార్క్ పాలనను రాజాసింగ్ బహిరంగంగానే కొనియాడారు. యోగి అండదండలతో ఉత్తరప్రదేశ్‌లో గానీ, లేదా తన భావజాలానికి అనుకూలంగా ఉండే మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో గానీ బీజేపీ తరఫున ఒకవేళ అధిష్ఠానం కరుణిస్తే లేదా హిందూత్వ సంస్థల మద్దతుతో కొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించినా ఆశ్చర్యపోనవసరం లేదు.ఆవేశంలో తీసుకున్న నిర్ణయం వల్ల సొంత నియోజకవర్గమైన గోషామహల్‌కే పరిమితమైన రాజాసింగ్ పరిస్థితి ప్రస్తుతం త్రిశంకు స్వర్గాన్ని తలపిస్తోంది. తెలంగాణలో తలుపులు మూసుకుపోవడంతో, తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి యూపీ, మహారాష్ట్రల రూపంలో ఆయనకు లభించే జాతీయ హిందూత్వ ఇమేజే ఏకైక శరణ్యంగా కనిపిస్తోంది. మరి యోగి ఆదిత్యనాథ్ మద్దతుతో రాజాసింగ్ జాతీయ రాజకీయ వేదికపై రీ-ఎంట్రీ ఇస్తారో లేక తెలంగాణ రాజకీయాల్లోనే మరో కొత్త వ్యూహంతో ముందుకు వస్తారో వేచి చూడాలి.

# బీఆర్ఎస్ డబుల్ బెడ్ రూమ్...

హైదరాబాద్, జూలై 25, హైదరాబాద్ మహానగరంలో సొంతింటి కోసం దశాబ్దాలుగా నిరీక్షిస్తున్న పేద, దిగువ మధ్యతరగతి ప్రజలను మరోసారి రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా స్కెచ్ వేసింది. నగర నడిబొడ్డున ఇందిరమ్మ టవర్స్ పేరుతో రూ. 40 నుంచి రూ. 60 లక్షల విలువైన ఫ్లాట్లను కేవలం రూ. 6 లక్షలకే ఇస్తామంటూ సరికొత్త సెంటిమెంట్ రగిలిస్తోంది. రూ. 5 లక్షల సబ్సిడీ, రిజర్వేషన్ల శాతం, మీ-సేవ దరఖాస్తులు అంటూ సుదీర్ఘమైన నిబంధనల జాబితాను ప్రకటిస్తూ.. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ స్కీమ్ తెరపైకి తెచ్చారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.గతంలో కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వం ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి, లక్షలాది మంది నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఓట్ల పండగ ముగిశాక పేదలను నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో నిర్మించిన అరకొర ఇళ్లకు పరిమితం చేసింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే కేసీఆర్ ఫార్ములా ను కాస్త రూపుమార్చి అమలు చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ఉచితం అని చెప్పకుండా.. రూ. 6 లక్షల భాగస్వామ్యం పేరుతో ప్రజల నుంచి ఆశలు రేకెత్తించి, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికి ఈ దరఖాస్తుల హంగామా అని ఎక్కువ మంది నమ్ముతున్నారు.ప్రస్తుతం తొలి విడతగా 16 నియోజకవర్గాల్లో ఈ ఇందిరమ్మ టవర్స్ కడతామని చెబుతున్న ప్రభుత్వం, అసలు ఇళ్లకు సరిపడా భూములు ఎక్కడ ఉన్నాయో స్పష్టం చేయడం లేదు. పార్టీ చేస్తున్న విమర్శలను విష ప్రచారం అని కొట్టిపారేస్తున్న కాంగ్రెస్ నేతలు, గత ప్రభుత్వం చేసిన పాత తప్పులనే మళ్లీ పునరావృతం చేస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. మీ-సేవ కేంద్రాలు, వాట్సాప్ నంబర్లు ఇచ్చి దరఖాస్తులు తీసుకోగానే సరిపోదని, అసలు ఇళు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పకుండా ఓటర్లను భ్రమల్లో ఉంచడమే కాంగ్రెస్ వ్యూహమన్న విమర్శలు ఉన్నాయి.గతంలో చూపించిన డబుల్ బెడ్‌రూమ్ డ్రీమ్ ఎలాగైతే ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకున్నారో ఇప్పుడు ఇందిరమ్మ టవర్స్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహా పథకాన్ని అమలు చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పేదవాడికి నిజంగా ఇల్లు అందుతుందా లేదా అన్నది పక్కనబెడితే.. గ్రేటర్ ఎన్నికల వేళ ఈ ఇందిరమ్మ ఇళ్ల ప్రకటన మాత్రం హైదరాబాద్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర కలకలం రేపుతోంది. కానీ ఇప్పటికీ కేసీఆర్ నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు చాలా వరకూ పంపిణీ కాలేదు. కొన్నింటిలో పనులు పెండింగ్ లో ఉన్నాయి.

# భారీగా పెరగనున్న ఆస్తి పన్ను..

హైదరాబాద్, జూలై 25, హైదరాబాద్ నగరంలోని భవనాలు, స్థలాల యజమానులకు ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటి వరకు కొనసాగుతున్న ఆస్తిపన్ను అసెస్మెంట్ విధానంలో మార్పులు తీసుకువస్తూ పాలకవర్గం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై సాంప్రదాయ అద్దె ప్రాతిపదికన కాకుండా.. మార్కెట్ రేట్లకు అనుగుణంగా పన్నులు వసూలు చేసేందుకు వీలుగా కొత్త బిల్లును సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదిత నిబంధనలు అమల్లోకి వస్తే.. పట్టణ ప్రాంతాల్లో నివాస, వాణిజ్య ఆస్తులపై పన్ను భారం ఊహించని రీతిలో పెరగనుంది.

హైదరాబాద్ నగరంలోని ఇళ్ల, వాణిజ్య సముదాయాల యజమానులపై ఆర్థిక భారం పెరగనుంది. దశాబ్దాలుగా అమల్లో ఉన్న వార్షిక అద్దె విలువ విధానానికి స్వస్తి పలికి.. దానికి బదులుగా క్యాపిటల్ విలువ ఆధారంగా ఆస్తి పన్నును నిర్ణయించేందుకు ప్రభుత్వం సమగ్ర అర్బన్ రిఫార్మ్ (సీయూఆర్ఈ) ముసాయిదా బిల్లులో ప్రతిపాదనలు రూపొందించింది. ఈ నూతన సంస్కరణల వల్ల నగర పరిధిలోని నివాసాల యజమానులతో పాటు వాణిజ్య సముదాయాల యజమానులపై పన్ను భారం పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.కొత్తగా తీసుకురానున్న 'క్యూర్' ముసాయిదా బిల్లు ప్రకారం.. ఆస్తిపన్ను లెక్కించడానికి రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించే భూమి, భవనాల క్యాపిటల్ విలువనే ప్రధాన ప్రాతిపదికగా తీసుకోనున్నారు. సాధారణంగా రియల్ ఎస్టేట్ రంగానికి అనుగుణంగా మార్కెట్లో భూముల ధరలు, భవనాల విలువలు ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంటాయి. దీనివల్ల పన్ను శాతాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా పెంచకపోయినా, భూముల మార్కెట్ విలువ పెరగడం వల్ల ఆస్తి పన్ను కూడా ప్రతి ఏటా ఆటోమేటిక్‌గా పెరుగుతూ పోతుంది.ఈ కొత్త ముసాయిదా చట్టంలో ఆస్తుల రకాన్ని బట్టి పన్ను శాతాలను ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇళ్లకు సంబంధించి క్యాపిటల్ విలువపై 0.10 శాతం నుంచి 0.50 శాతం వరకు పన్ను స్లాబ్‌లను వర్తింపజేయాలని ప్రతిపాదించారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, దుకాణాలకు సంబంధించి క్యాపిటల్ విలువలో 0.20 శాతం నుంచి గరిష్టంగా 2.00 శాతం వరకు పన్ను స్లాబ్‌లను విధించనున్నట్లు స్పష్టం చేశారు.ఈ ప్రతిపాదిత విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే నగరంలో ఆస్తులు ఉన్న వారిపై ఆర్థికంగా ప్రభావం పడే అవకాశం ఉంది. పెరుగుతున్న భూముల రేట్లకు అనుగుణంగా ఏటా పన్ను పెరిగే నిబంధన ఉండటంతో.. భవిష్యత్తులో పన్ను భారం మరింత పెరగనుందని స్పష్టం అవుతోంది. అది జరిగితే యజమానులు తమపై పడే పన్ను భారాన్ని అద్దెలు పెంచడం ద్వారా పూడ్చుకోవడానికి ప్రయత్నిస్తారు. దీని వల్ల అంతిమంగా భారం అద్దెదారులపైనే పడే అవకాశం ఉంటుంది.

## తల్లికి వందనం డబ్బు కోసం....
## భార్యగొంతుకోసి హత్య

అన్నమయ్య అన్నమయ్య జిల్లాలో మహిళా దారణ హత్యకు గురయింది. . తల్లికి వందనం డబ్బు కోసం భార్యను భర్త గొంతుకోసి హత్య చేసాడు. పిటియం మండలం రాపూరివారిపల్లి పంచాయితి కొత్తపల్లి సమీపంలో రాత్రి పద్మావతి అనే మహిళను అతి కిరాతకంగా గొంతుకోసి దారణ హత్య చేసాడు

తల్లికి వందనం డబ్బు ఇవ్వలేదని భర్తే సురేష్ రాత్రి చిత్ర హింసలు పెట్టి గొంతుకోసాడని హత్యకు గురైన మహిళ పద్మావతి తల్లి కళావతి ఆరోపించింది. మృతురాలికి ఇద్దరు కుమారులు వున్నారు. పెద్దతిప్పసముద్రం పోలీసులు ??కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మల్లారెడ్డి.. అంతు చిక్కని నాడి



హైదరాబాద్, జూలై 25, తెలంగాణ రాజకీయాల్లో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వైఖరి ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటుండటం, అధికార కాంగ్రెస్ నేతలతోనూ, బీజేపీ అగ్రనేతలతోనూ ఆయన జరిపిన భేటీలతో మల్లారెడ్డి పార్టీ మారడం ఖాయమనే ప్రచారం జోరుగా సాగింది. కానీ ఎప్పుడూ ఆయన బీఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పానని మాత్రం చెప్పలేదు. ఆ పార్టీలోనే ఉంటానని అంటూంటారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా బోయిన్‌పల్లిలోని తన కార్యాలయంలో వేడుకలు నిర్వహించి తాను ఎప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. కానీ, అక్కడ ఆయన ప్రదర్శించిన హావభావాలు, వాతావరణం చూసిన రాజకీయ విశ్లేషకులు ఇది పక్కా డబుల్ గేమ్ అని క్లారిటీకి వచ్చేశారు. కేటీఆర్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మల్లారెడ్డి మెడలో గులాబీ రంగు కండువా ఉన్నప్పటికీ, దానిపై ఎలాంటి బీఆర్ఎస్ పార్టీ గుర్తులు లేవు. అంతేకాకుండా, ఆయన కార్యాలయం వద్ద సాధారణంగా కనిపించే జెండాలు, కేసీఆర్, కేటీఆర్‌ల భారీ కటౌట్లు లేకుండా కేవలం ఒక సాధారణ శుభాకాంక్షల బోర్డుతోనే సర్దేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. బీఆర్ఎస్ పార్టీని వీడే ఆలోచన లేదని పైకి చెబుతున్నా, పార్టీ చిహ్నాలను పక్కన పెట్టడం వెనుక అధిష్ఠానానికి ఒక రకమైన సిగ్నల్ ఇస్తున్నారా అనే చర్చ క్యాడర్‌లో మొదలైంది. ఈ పరిణామాలకు ముందు, మల్లారెడ్డి వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఒక బీఆర్ఎస్ కార్యకర్త రక్తంతో లేఖ రాయడం పెద్ద కలకలమే రేపింది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అన్ని పదవులు, అవకాశాలు అనుభవించి.. ఇప్పుడు ప్రతిపక్షంలోకి రాగానే పార్టీకి, కార్యకర్తలకు దూరంగా ఉండటం సరికాదని సదరు కార్యకర్త ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. గులాబీ శ్రేణుల్లో తన ప్రతిష్ట దెబ్బతింటోందని గ్రహించిన మల్లారెడ్డి, ఆ రక్తపు లేఖపై స్పందిస్తూ తనకు పార్టీ మారే ఉద్దేశం లేదని, ఆ లేఖ రాసిన కార్యకర్తను స్వయంగా కలిసి మాట్లాడతానని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఎటు చూసినా మల్లారెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై స్పష్టమైన క్లారిటీ ఇవ్వకుండా సేఫ్ గేమ్ ఆడుతున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఒకవైపు పార్టీని విడిచిపెడితే వచ్చే నష్టాలను, వ్యాపార సామ్రాజ్యాలపై పడే ప్రభావాన్ని అంచనా వేస్తూనే.. మరోవైపు బీఆర్ఎస్‌లోనే ఉంటూ సొంత గుర్తులకు, జెండాలకు దూరంగా ఉండటం ద్వారా ఆయన పొలిటికల్ సేఫ్ ఎగ్జిట్ కోసం మార్గం సుగమం చేసుకుంటున్నారని భావిస్తున్నారు. ను బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నట్లు జరుగుతు ప్రచారంలో నిజం లేదన్నారు మల్లారెడ్డి. చివరివరకు బీఆర్ఎస్‌లోనే ఉంటానని.. కొంతమంది ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారని.. ఎవరూ నమ్మొద్దన్నారు. తాను పార్టీ మారబోతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని నిజం అనుకుని ఓ అభిమాని రక్తంతో లేఖ పంపడం చూసి బాధపడ్డానని చెప్పుకొచ్చారు. లేఖ రాసిన కార్యకర్త ఎవరో తెలుసుకుని త్వరలోనే స్వయంగా కలిసి మాట్లాడతానన్నారు. కేటీఆర్ నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని.. ఆయనకు బర్త్ డే విషెస్ తెలియజేశారు. తెలంగాణకు కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారని.. ఆయన్ను సీఎం కుర్చీలో చూడటమే తన లక్ష్యమన్నారు. మల్లారెడ్డి పార్టీ మారతారనే ప్రచారంతో.. ఇటీవల బీఆర్ఎస్ కార్యకర్త రక్తంతో పంపిన లేఖ వైరల్ అయ్యింది. మల్లారెడ్డి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారని.. లక్షలాది మంది కార్యకర్తల విశ్వాసాన్ని మల్లారెడ్డి దెబ్బతీస్తున్నారని కార్యకర్త ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్ని విస్మరించడం సరికాదని.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు యాక్టివ్‌గా ఉన్న మల్లారెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కార్యక్రమాలకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. అధికార పార్టీ కార్యక్రమాల వేదికలపై మల్లారెడ్డి కనిపించడం వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న లక్షలాది మంది కార్యకర్తల్లో తప్పుడు సంకేతాలు వెళుతున్నాయన్నారు. మల్లారెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తల్ని తన సంస్థల్లో పనిచేసే ఉద్యోగులుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు, కేడర్‌కు అండగా ఉండాల్సింది పోయి దూరంగా ఉండటం పార్టీకి నష్టమన్నారు. పార్టీ సిద్ధాంతాలను, కార్యకర్తలను మరచిపోయిన నేతలు చరిత్రలో కనుమరుగైపోవడం ఖాయమన్నారు. పార్టీపై ప్రేమతో లేఖ రాస్తున్నానని.. ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదన్నారు. ఒక కార్యకర్తగా మనసులో బాధను చెబుతున్నాను అన్నారు. మొత్తానికి మల్లారెడ్డి పార్టీ మార్పు ప్రచారానికి ఎండ్ కార్డ్ వేశారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని మరోసారి తేల్చి చెప్పారు.

# సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

## స్వామి వారి దయతో కూటమి ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి



విశాఖపట్నం క్రీడాశాఖల మంత్రి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. . ఆలయ మర్యాదలతో మంత్రికి ఇూ వెంకట్రావు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీవాసచార్యులు పూర్ణకుంభంతో మర్యాదపూర్వక స్వాగతం పలికారు మండపంలో రాతి సానలపై చందనం చెక్కలను గంధం అరగదీసారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య మంత్రికి ఆశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వామి వారి దయతో కూటమి ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి సాగిస్తోందని రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం మంత్రి స్వామివారిని ప్రార్థించారు.

# ఉండవల్లి లో కొవ్వొత్తుల ర్యాలీ

ఉండవల్లి సెంటర్ నీట్ పేపర్ లీకేజీ కి వ్యవహారంపై ఢిల్లీ లో జంతర్ మంతర్ దగ్గర తమ ఆందోళన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీ చార్జి కి నిరసనగా రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు ఉండవల్లి సెంటర్లో జరిగిన ఈ ర్యాలీలో రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ పేపర్ లీకేజ్ అనేది ఒక హేయమైన చర్య యువత భవిష్యత్తుతో చలగాటం ఆడుతున్న ఈ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు బుద్ధి చెప్తారని పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ తక్షణమే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన రైతు సంఘం నాయకులు ×ఈ కార్యక్రమంలో ఏపీరైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్న శివ శంకర్, రైతు సంఘం కోశాధికారి సూరి నారాయణ,రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుయు రాజశేఖర్,యుటిఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు ఏం రవి, సిఐటియు గుంటూరు జిల్లా నాయకులు కే జగదీశ్వర్ రెడ్డి, రైతు సంఘం రాజధాని డివిజన్ కార్యదర్శి డి శ్రీనివాస కుమారి, మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి వెంకట్ రెడ్డి, రైతు సంఘం తాడేపల్లి రూరల్ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు


# మైనర్ బాలికపై లైంగిక దాడి

## మేనమామ, వరుస సోదరులే నిందితులు

మేడ్చల్ గంజాయి మత్తులో మైనర్ బాలికపై మేనమామ, సోదరులు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన జరిగింది. బాధిత బాలిక తన తల్లిదండ్రులు చనిపోవడంతో కీసరలోని తన అమ్మమ్మ వద్ద ఉంటోంది. స్థానికుల సహాయంతో తుర్కపల్లిలోని వసతి గృహంలో చేరి, ఇటీవల సెలవులు కావడంతో కీసరలోని అమ్మమ్మ ఇంటికి వచ్చింది.

ఒంటరిగా ఉన్న సమయంలో గంజాయి మత్తులో మేనమామ, వరుసకు సోదరులైన ఇద్దరు యువకులు బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. నిందితులు విషయం బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. వసతి గృహానికి వెళ్లిన బాలికకు అక్కడ ఫ్యాన్ తగిలి గాయాలు అఅయయాయి. అమ్మమ్మ దగ్గరికి తిరిగి రాగా లైంగిక దాడి విషయం బయటపడింది. పోలీసులు నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పరారైన ఇద్దరి గురించి గాలింపు కొనసాగుతోంది.

## ఐదో అంతస్తు నుంచి దూకి వైద్యా విద్యార్థిని ఆత్మహత్య



మేడ్చల్ జిల్లా నాగారం వెస్ట్ గాంధీనగర్లో విషాదం నెలకొంది. ఐదో అంతస్తు నుంచి దూకి పీజీ వైద్య విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు దీక్షిత (26) అపార్ట్మెంట్ ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. దీక్షిత బెంగళూరులోని కళాశాలలో పీజీ ఆప్తాల్మాలజీ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. పోలీసులు స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# క్రమశిక్షణ, ఫిట్నెస్ పోలీస్ శాఖకు మూలాధారం

**వీక్లీ పరేడ్‌తో పోలీస్ సిబ్బందిలో శారీరక దృఢత్వం**

**ఆరోగ్య పరిరక్షణతోనే సమర్థవంతమైన విధినిర్వహణ**

**విధినిర్వహణ ఎంత ముఖ్యమో, ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యం**

**వీక్లీ పరేడ్‌లో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల,**

ఈ రోజు నిర్మల్ జిల్లా పోలీస్ ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లాలోని సివిల్, ఆర్మ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్ డ్రిల్, స్క్వాడ్ డ్రిల్‌ను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...వీక్లీ పరేడ్ వల్ల పోలీస్ సిబ్బందిలో శారీరక దృఢత్వం పెరగడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. విధుల మధ్య సమయం దొరికినప్పుడల్లా వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని, ఫిట్నెస్‌ను నిరంతరం కాపాడుకోవడం ద్వారా మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించవచ్చన్నారు. పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.



వ్యక్తిగత, ఆరోగ్య లేదా విధులకు సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండి పోలీస్ శాఖ ప్రతిష్టను కాపాడాలని, క్రమం తప్పకుండా హెల్త్ చెకప్‌లు చేయించుకోవాలని సూచించారు. వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకొని, సమయం దొరికినప్పుడు కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్, డీఎస్పీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్, రవీందర్, సత్యనారాయణ, దీపక్, కృష్ణ, సమ్మయ్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామ్ నిరంజన్ రావు, శేఖర్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతాంగానికి అండగా "నంది రైతు సమాఖ్య"

## నూతన కార్యాలయము పునః ప్రారంభించడం



నంద్యాల నంది రైతు సమాఖ్య కార్యాలయం తిరిగి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, మాజీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మాజీ మార్కెట్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, నంది రైతు సమైక్య అధ్యక్షుడు బెక్కం రామసుబ్బారెడ్డి, రాష్ట్ర సీఈసీ సభ్యుడు దేశం సుధాకర్ రెడ్డి, వైసీపీ నాయకులు, రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇసాక్ భాషా మాట్లాడుతూ గత 29 సంవత్సరాలుగా నంద్యాల ప్రాంతంలో రైతు సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న 'నంది రైతు సమాఖ్య' పునఃప్రారంభం కావడం అత్యంత శుభపరిణామం. రైతులకు అవసరమైన స్ప్రేయర్లు, ఎరువులు (ఈవతీబితిశ్రీతిళివతీబ), పురుగుల మందులు (ఖవబబితిఇతిటవబ) అందించడంతో పాటు రైతుల హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన చరిత్ర ఈ సంస్థది. ఎల్ నినో ప్రభావం ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో, ఏ పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుంది? నష్టాలను ఏ విధంగా నివారించవచ్చనే అంశాలపై శాస్త్రవేత్తల సలహాలను రైతులకు అందిస్తూ సమాఖ్య అండగా నిలుస్తోంది. లాభాపేక్ష లేని సేవ, రూపాయి లాభం ఆశించకుండా, కేవలం రైతన్నకు మంచి చేయాలనే ఉద్దేశంతో ఏర్పడిన సంస్థ ఇది. నంది రైతు సమాఖ్యకు ప్రతీ ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా మద్దతు అందించాలని కోరుకుంటున్నానని అన్నారు.

## విద్యార్థులను దేశద్రోహులుగా చూస్తున్నారు: సోనియా గాంధీ

న్యూఢిల్లీ, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ నరేంద్రమోదీ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, విద్యార్థుల నిరసనలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆమె తప్పుపట్టారు. ముఖ్యంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడాన్ని ప్రశ్నించారు. విద్యా వ్యవస్థలో తీవ్రమైన వైఫల్యాలు వెలుగులోకి వచ్చినప్పటికీ సదరు కేంద్ర మంత్రి బాధ్యత వహించకుండా పదవిలో ఇంకా కొనసాగుతున్నారని సోనియా గాంధీ ధ్వజమెత్తారు.

# స్కూలు బస్సుల భద్రత మరింత పెంచాలి

## (హెచ్.ప్రతాప్)

మేడ్చల్ పరిధిలోని ఎల్లంపేట వద్ద శనివారం ఉదయం ఒక స్కూల్ బస్సు లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొన్న ఘటన తీవ్ర కలకలం రేపింది. విద్యార్థులను తీసుకువెళ్లేందుకు వెళ్తున్న సమయంలో డ్రైవర్ ముందున్న లారీని గమనించకపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు సహా డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, పోలీసులు బాధితులను తక్షణమే ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం విద్యార్థుల రవాణా భద్రతపై మళ్లీ గంభీర చర్చను తెరపైకి తెచ్చింది. ఇలాంటి ప్రమాదాలు ఒక్క క్షణం నిర్లక్ష్యంతో కూడా పెద్ద నష్టానికి దారి తీస్తాయని ఈ ఘటన మరోసారి గుర్తు చేసింది.

స్కూల్ బస్సుల భద్రత కోసం మొదటి అవసరం డ్రైవర్ క్రమశిక్షణ. డ్రైవర్‌కు సరైన శిక్షణ, అనుభవం, ఆరోగ్య పరీక్షలు, పని గంటల పరిమితి ఉండాలి. అలసట, నిద్రమత్తు, వేగం, నిర్లక్ష్యం వంటి కారణాలు ప్రమాదాలకు ప్రధాన మూలాలు అవుతాయి. ప్రతి బస్సులో వేగపరిమితి పాటించే విధానం, జిపిఎస్ ట్రాకింగ్, ఆకస్మిక బ్రేకింగ్ హెచ్చరికలు ఉండాలి.

రెండోది వాహనాల సాంకేతిక తనిఖీ. బ్రేకులు, టైర్లు, లైట్లు, డోర్లు, సీట్లు, అత్యవసర నిష్క్రమణ మార్గాలను రోజూ పరీక్షించాలి. నెలకు ఒకసారి తప్పనిసరిగా సమగ్ర నిర్వహణ చేపట్టాలి. పాతబడ్డ లేదా పనికిరాని బస్సులను విద్యార్థుల రవాణాకు వాడకూడదు. సీటుబెల్టులు, ప్రథమ చికిత్స సామగ్రి, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలి.

మూడోది పర్యవేక్షణ వ్యవస్థ. పాఠశాల యాజమాన్యం, రవాణా విభాగం, తల్లిదండ్రులు కలిసి భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలి. బస్సులో ఉన్న విద్యార్థుల సంఖ్య, ఎక్కింపు–దిగింపు సమయం, మార్గం వివరాలు, డ్రైవర్ సమాచారం పారదర్శకంగా ఉండాలి. ప్రతి బస్సులో ఒక సహాయకుడు ఉండటం చిన్న పిల్లలకు మరింత భద్రత ఇస్తుంది. అంతేకాకుండా పాఠశాల యాజమాన్యాలు భద్రతా నిబంధనలను పాటించడంలో విఫలమైతే రవాణా శాఖ కఠిన చర్యలు తీసుకోవాలి.

నాలుగోది రోడ్డు భద్రతపై అవగాహన. బస్సు డ్రైవర్లకు మాత్రమే కాకుండా విద్యార్థులకు కూడా రోడ్డు నియమాలు నేర్పాలి. బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు, కిటికీల వద్ద, నిలబడే సమయంలో ఎలా ప్రవర్తించాలో శిక్షణ ఇవ్వాలి. తల్లిదండ్రులు కూడా బస్సు వేగం, డ్రైవింగ్ అలవాట్లు, నిర్వహణపై ప్రశ్నించే అలవాటు పెంచుకోవాలి. నిబంధనలను ఉల్లంఘించే వాహనాలపై ప్రయాణీకులు తక్షణమే రవాణా అధికారులకు ఫిర్యాదు చేసే వేదికలను అందుబాటులోకి తేవాలో.

విద్యార్థుల ప్రయాణం సాధారణ ప్రయాణం కాదు; అది భవిష్యత్తుకు వెళ్లే మార్గం. అందుకే స్కూల్ బస్సుల భద్రతను సౌకర్యంగా కాకుండా, తప్పనిసరి బాధ్యతగా చూడాలి. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మాత్రమే చిన్నారుల ప్రాణాలకు రక్షణ లభిస్తుంది.

# విద్యార్థుల ఉద్యమం దేశవ్యతిరేక శక్తుల చేతులోకి వెళ్లకూడదు

## యువతను హింస మార్గంలోకివెళ్లకూడదు

## బీజేపీ నేత కోలన్ శంకర్ రెడ్డి

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ జులై 25; విద్యార్థుల , యువత ఆశయాలను గౌరవిస్తు , విద్యార్థుల ఉద్యమం దేశవ్యతిరేక శక్తుల చేతులోకి వెళ్లడం , యువతను హింస మార్గంలోకి వెళ్లకూడదని విద్యార్థుల జీవితాల మంచికోసమే నైతిక బాధ్యత గా ఎలాంటి బెవజాలకు పోకుండా. నా రాజీనామా ను ప్రధాని నరేంద్ర మోదీ కి పంపాడం బిజెపి నేత ధర్మేంద్ర ప్రధాన్ తన నీతి నిజాయితీని దేశ యువతకోసం నిరూపించుకున్నారని బీజేపీ నేత కోలన్ శంకర్ రెడ్డి అన్నారు.



కానీ కాంగ్రెస్, పార్టీ దాని మిత్ర పక్షాలు స్కాంలు అయిన , ఎగ్జామ్ పేపర్ లీకు లైన , అవినీతి జరిగిన విద్యార్థులు ప్రాణాలు పోయినా కాంగ్రెస్ ఎప్పుడు పట్టించుకోలేదు తెలంగాణ లో 10 వ ఫ్ర ఇంటర్ పేపర్లు లీక్ ఐన సీఎం గా సంబంధిత విద్యా శాఖ , మున్సిపల్ మంత్రి గా రేవంత్ రెడ్డి రాజీనామా చేయలేదు కానీ బిజెపి నేత నియతి కోసం రాజీనామా చేశారు ఇది కాంగ్రెస్ కు బీజేపీ కి తేడా అన్నారు బీజేపీ నేత కోలన్ శంకర్ రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణ ఉద్యమ మేధోశక్తి ఎ.పద్మాచారి జన్మదిన వేడుకల్లో వక్తలు ఉద్ఘాతన







**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ జులై 25; తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన పద్మాచారి సేవలనుప్రముఖులు కొనియాడారు.తెలంగాణ ఉద్యోగుల సంఘం గౌరవ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ న్యాయవాది ఎ. పద్మాచారి జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని హోటల్ అబోడ్‌లో అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ రాజకీయ, సామాజిక, ఉద్యోగ, న్యాయ, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖులు ఒకే వేదికపై చేరి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణ ఉద్యమంలో, ఉద్యోగుల సంక్షేమంలో, సమాజ సేవలో ఆయన చేసిన విశిష్ట సేవలను కొనియాడారు.

వివాదాలకు అతీతుడు... అపార జ్ఞానం కలిగిన వ్యూహకర్త... బీసీల పెద్దన్న అంటూ ప్రశంసల వర్షం కురిపించారు.

ఉద్యోగి నుంచి సుప్రీంకోర్టు న్యాయవాది వరకు ఆయన ప్రస్థానం స్ఫూర్తిదాయకమన్నారూ. పాట రూపంలో పద్మాచారి సేవలను ఆవిష్కరించిన దరువు అంజన్న... భావోద్వేగానికి సభికులు గురైన్నారు

పదవులు మనిషిని గొప్పవాడిని చేయవు... ప్రజల హృదయాల్లో నిలిచే సేవలే చరిత్రలో చిరస్థాయిగా నిలిపేస్తాయని కొనియాడారు

ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ మాజీ కేంద్ర మంత్రి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, వడ్డెర సహకార సంస్థ చైర్మన్ గట్టు తిమ్మప్ప, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.గౌతమ్ రావు, బీజేపీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్, తెలంగాణ సాంస్కృతిక ప్రతినిధి దరువు అంజన్న, ప్రొఫెసర్ జయకిషన్, గిన్నిస్ వరల్డ్ రికార్డు గ్రహీత శాంతి కృష్ణ, సీనియర్ అడ్వకేట్ పెండోట శ్రీనివాస్, తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీ రాములు, తెలంగాణ బీడీఎల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దానకర్ణ చారితో పాటు ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, మేధావులు, సామాజికవేత్తలు, పెద్ద సంఖ్యలో తెలంగాణ ఉద్యోగుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రారంభంలో కేక్ కటింగ్, శాలువాతో ఘన సన్మానం, పుష్పగుచ్ఛాల అందజేత, జ్ఞాపికల ప్రదానం నిర్వహించారు.

దరువు అంజన్న పాటతో హృదయాలను హత్తుకున్న వేడుక

కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక ప్రతినిధి దరువు అంజన్న తనకు పద్మాచారి గారితో ఉన్న దశాబ్దాల అనుబంధాన్ని పాట రూపంలో ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమంలో పద్మాచారి పోరాట స్ఫూర్తి, ఉద్యమానికి అందించిన మేధోబలం, ఉద్యోగుల కోసం చేసిన నిరంతర పోరాటం, సమాజం పట్ల ఆయనకున్న నిబద్ధతను భావోద్వేగభరితమైన గీతంలో ఆలపించగా సభికులంతా చప్పట్లతో అభినందించారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యోగుల సెంట్రల్ అసోసియేషన్‌కు నాయకత్వం వహిస్తూ ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన ఆయన పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, అందరికీ పెద్దన్నగా నిలిచిన వ్యక్తిత్వాన్ని అంజన్న హృదయాలకు హత్తుకునేలా వివరించారు.

వివాదాలకు అతీతుడు... విజ్ఞానానికి ప్రతిరూపం

వక్తలందరూ ఒకే స్వరంతో పద్మాచారి గారిని వివాదాలకు దూరంగా ఉండే సౌమ్యుడు, అపారమైన జ్ఞాన సంపద కలిగిన వ్యూహకర్త, బీసీ సమాజానికి పెద్దన్న, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మార్గదర్శి, ప్రజల పక్షాన నిలిచే మేధావిగా అభివర్ణించారు.

సెక్షన్ ఆఫీసర్‌గా ప్రభుత్వ సేవ నుంచి పదవీ విరమణ చేసిన అనంతరం కూడా విశ్రాంతి తీసుకోకుండా తెలంగాణ హైకోర్టు, భారత సుప్రీంకోర్టుల్లో న్యాయవాదిగా ప్రజా సమస్యలపై చట్టపరమైన పోరాటం కొనసాగించడం ఆయన సమాజ సేవకు నిదర్శనమని కొనియాడారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యోగుల సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల శక్తిని ఉద్యమానికి అంకితం చేస్తూ రాష్ట్ర సాధనలో పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

బండారుదత్తాత్రేయ

భారత ప్రభుత్వ మాజీ కేంద్ర మంత్రి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, 2002 సంవత్సరం నుంచి పద్మాచారి గారితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన, ఉద్యోగులు, నిరుద్యోగ యువతకు న్యాయం జరగాలనే లక్ష్యంతో ఎన్నోసార్లు చర్చలు జరిపారని తెలిపారు. ఉద్యమ కాలంలో ఉద్యోగుల సంఘాలు, ఉద్యోగుల జేఏసీ, పొలిటికల్ జేఏసీ, పలు కమిటీలకు ఆయన అందించిన మేధోబలం తెలంగాణ ఉద్యమానికి ఎంతో దోహదపడిందన్నారు.

పద్మాచారి అవసరమైన ప్రతి ఒక్కరికీ ఓర్పుతో, సోదరభావంతో మార్గనిర్దేశం చేసే వ్యక్తిత్వం కలిగిన నాయకుడని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ల జీవించి సమాజానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

ఎన్. రామచందర్ రావు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు మాట్లాడుతూ, పద్మాచారి గారు గొప్ప జాతీయవాది, దేశం, రాష్ట్రం, సమాజంపై విశేష అవగాహన కలిగిన మేధావి అని కొనియాడారు. ప్రజా సమస్యలపై హైకోర్టు, సుప్రీంకోర్టు స్థాయిలో కూడా చట్టపరమైన పోరాటాలు చేసే ధైర్యసాహసాలు ఆయన ప్రత్యేకత అన్నారు.

దాసోజు శ్రవణ్ కుమార్

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల గొంతుకగా నిలబడి వారి సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లిన నాయకుడు పద్మాచారి గారని, సమాజం పట్ల బాధ్యతతో పనిచేసే ఆదర్శ వ్యక్తి అని పేర్కొన్నారు.

గట్టు తిమ్మప్ప

వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం పద్మాచారి చేసిన సూచనలు, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు.

కప్పర ప్రసాద్

బీజేపీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ సమయంలో జర్నలిస్టులతో మమేకమై ఉద్యమానికి మేధోపరమైన బలం అందించడంలో పద్మాచారి గారి పాత్ర మరువలేనిదని కొనియాడారు.

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. గౌతమ్ రావు మాట్లాడుతూ, ఇంతమంది ప్రముఖులు ఒకే వేదికపై చేరి పద్మాచారిని సత్కరించడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు డా.కృష్ణారావు మాట్లాడుతూ, ఉద్యోగ సంఘాలకు పద్మాచారి నాయకత్వం చిరస్థాయిగా ఆదర్శంగా నిలుస్తుందని, ఆయన చూపిన మార్గం భావితరాలకు స్ఫూర్తి అని అన్నారు.సభాధ్యక్షులు ఎం. రవీందర్ కుమార్ మాట్లాడుతూ, పద్మాచారి గారి సేవలను గుర్తించి జన్మదిన వేడుకలను నిర్వహించడం తెలంగాణ ఉద్యోగుల సంఘానికి గర్వకారణమని, ఆయన అనుభవం, మార్గదర్శకత్వం భవిష్యత్తులో కూడా సమాజానికి ఎంతో అవసరమని అన్నారు.చివరగా ప్రముఖులందరూ ఎ. పద్మాచారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు పొందాలని, రాబోయే రోజుల్లో దేశంలోనే అత్యున్నత స్థానాలను అధిరోహిస్తూ ప్రజా సేవను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు.కార్యక్రమం ముగిసే సమయానికి సభికులందరిలో ఒకే భావన వ్యక్తమైంది. తెలంగాణ ఉద్యమానికి మేధస్సును అందించిన నాయకుడు, ఉద్యోగుల పెద్దన్న, సమాజానికి మార్గదర్శకుడు, న్యాయ పోరాట యోధుడు ఎ. పద్మాచారి సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలిచిపోతాయన్నారు.

కార్యక్రమం లో తెలంగాణ ఉద్యోగుల సంఘ సభ్యులు డా. కృష్ణారావు -- తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు.

వి. సురేందర్ -- ఆర్గనైజింగ్ సెక్రటరీ.

ఎన్. నర్సింగ్ రావు -- తెలంగాణ ఉద్యోగుల సంఘం, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు.

పి. కృష్ణమూర్తి-- ఛైర్మన్, తెలంగాణ డెయిరీ కమిటీ. వారందరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# ప్రజల భాగస్వామ్యంతో అమరావతి అభివృద్ధిపై గుంటూరులో వి టేబుల్ సమావేశం

గుంటూరు, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేయడంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు పబ్లిక్ పాలసీ డెవలప్మెంట్ ఫోరం (పీపిడిఎఫ్) ఆధ్వర్యంలో శనివారం గుంటూరు జిల్లా గ్రంథాలయంలో వి టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, నిపుణులు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొని అమరావతి అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. ఈ సందర్భంగా బీజేపీ అధ్యక్షుడు జైప్రకాష్ మాట్లాడుతూ, అమరావతి అభివృద్ధి రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమని అన్నారు. భూసేకరణ, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, ప్రజా భాగస్వామ్యంతో రాజధానిని దేశ రాజధాని ఢిల్లీ తరహాలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాజధాని నిర్మాణ నమూనా, రైతుల ప్రయోజనాల పరిరక్షణ, అభివృద్ధి చేసిన ప్లాట్ల పంపిణీ, ఐటీ మరియు నాలెడ్జ్ సిటీ అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాలు, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా విధానాల రూపకల్పనలో ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో వచ్చిన సూచనలు, సిఫార్సులను సమగ్ర నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేసి అమరావతి అభివృద్ధి రోడ్‌మ్యాప్‌కు విధానపరమైన సూచనలుగా సమర్పించ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెనాలి ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, బీజేపీ అధ్యక్షుడు జైప్రకాష్, ఎస్ సీ సోషల్ వెల్ ఫేర్ బాలకోటయ్య, కూటమి నాయకులు, నిపుణులు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ విడుదలచేయాలి

### సికింద్రాబాద్ క్లాక్ టవర్ చౌరస్తాలో ఎబివిపి ధర్నా



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ జులై 25 ;అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సికింద్రాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ప్యారడైజ్ నగరంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సికింద్రాబాద్ క్లాక్ టవర్ చౌరస్తాలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ చేర్క బాలకృష్ణ గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో స్కాలర్షిప్ లు విడుదల కాగా విద్యార్థులు హరిగోసలు పడుతున్నారని. ప్రభుత్వం స్కాలర్షిప్ విడుదల చేయని కారణంగా కాలేజీలలో సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఏబీవీపీ ఉద్యమాలకు శ్రీకారం చుడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిటీ ఎస్ ఎఫ్ డి కన్వీనర్ పాండురంగ, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మిద్దెల గౌతమ్ నగర సంయుక్త కార్యదర్శి వికాస్ కార్యకర్తలు వరుణ్, రేవంత్, శివ, హర్షవర్ధన్, మణి మరియు ఇతర కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్య విజయం

### ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

### విద్యార్థి శక్తి ముందు నిరంకుశత్వం లొంగాల్సిందేనని ఉద్ఘాటన

### లక్షలాది మంది భవిష్యత్తుతో ఆడుకున్న కేంద్రానికి చెంపపెట్టు



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జులై 25 ప్రజాబలం:**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ప్రజాస్వామ్యానికి దక్కిన గొప్ప విజయమని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థి శక్తి ముందు నిరంకుశత్వం తప్పకుండా లొంగాల్సిందేనని ఆయన తేల్చిచెప్పారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు, భవిష్యత్తుతో ఆడుకున్న కార్పొరేట్–కాషాయ సర్కారుకు ఈ పరిణామం ఒక బలమైన చెంపపెట్టు అని ఆయన విమర్శించారు. ఈ సువర్ణాక్షర విజయం దేశవ్యాప్తంగా ఉన్న పోరాట శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపిందని పేర్కొంటూ శనివారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

తొలినుంచీ గళమెత్తిన రాహుల్ గాంధీ గారు.. గత పార్లమెంట్ సమావేశాల్లోనే నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర చర్చ జరగాలని లోక్‌సభ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గట్టిగా డిమాండ్ చేసినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎలాంటి తప్పు జరగనట్లుగా అహంభావంతో వ్యవహరించిందని ఎంపీ రఘురాం రెడ్డి మండిపడ్డారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఆందోళనలు చేపట్టినా, రాహుల్ గాంధీ స్వయంగా ప్రధానమంత్రి నివాసం ముందు ధర్నా నిర్వహించినా... కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, ప్రతిపక్షాలు, ప్రజల డిమాండ్లను ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. ఎట్టకేలకు విద్యార్థులు, రాహుల్ గాంధీ సంయుక్త పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం, నరేంద్ర మోదీ తొలిసారిగా దిగివచ్చి రాజీనామాను స్వీకరించాల్సి వచ్చిందని ఆయన గుర్తుచేశారు.

కేవలం రాజీనామాతో సరిపోదు.. సమగ్ర చర్చ జరగాలికేవలం కేంద్ర మంత్రి రాజీనామాతో ఈ సమస్యకు పూర్తి పరిష్కారం లభించదని, దీనిపై పార్లమెంట్‌లో లోతుగా చర్చ జరగాలని ఎంపీ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పేపర్ లీకేజీ ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, జాతీయ స్థాయి పోటీ పరీక్షలన్నింటినీ అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా అహంభావాన్ని వీడి ప్రతిపక్ష పార్టీలకు, ప్రజల ఆకాంక్షలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని రఘురాం రెడ్డి హితవు పలికారు.

## విశ్వకర్మీయులలో ఐటీ దిగ్గజాలు

### విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్ భేటీ




హైదరాబాద్, జూలై 25: విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ ఆధ్వర్యంలో ఐటీ ప్రొఫెషనల్ ఫ్రెండ్లీ మీట్ కార్యక్రమం ఘనంగా జరిగింది. హైదరాబాద్ నగరంలోని వాసవి క్లబ్ లో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ఐటీ రంగానికి చెందిన విశ్వకర్మ ప్రముఖులు హాజరయ్యారు. విశ్వకర్మలు ఏకీకృతం కావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయి అని కొనియాడారు.

విశ్వకర్మలు అయిదు వృత్తులలోనే కాకుండా, అన్ని రంగాలలోనూ అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శిస్తున్నారని వక్తలు అన్నారు. ప్రపంచంలోని దిగ్గజ ఐటీ కంపెనీలలో విశ్వబ్రాహ్మణులు సత్తా కనబరుస్తున్నారని, డల్లాస్ నుండి వచ్చిన గ్లోబల్ విశ్వకర్మ సంస్థ ప్రతినిధి చైతన్య తెలిపారు. విశ్వకర్మ జాతికి చెందిన వివిధ రంగాల్లో నిష్ణాతులై సమాజానికి ఉపయోగపడే స్థాయిలో ఉన్న వ్యక్తుల్ని గుర్తించి వారి సహాయ సహకారాలు తీసుకుని ముందుకెళ్లాలని ఇతర వక్తలు సూచించారు. విశ్వకర్మ కులానికి చెందినవారందరిని ఒక వేదిక పైకి తీసుకుని వచ్చి జేఏసీ ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో ప్రత్యేక వెబ్ సైట్ రూపొందించి జనాభా లెక్కలు తేల్చాలని అందరూ అభిప్రాయపడ్డారు. విశ్వకర్మ ఐదు కులాలకు చెందిన వారిని ప్రభుత్వం గుర్తించి అన్ని కులాలను ఒకే తాటిపైకి తీసుకొచ్చి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ముమ్ముందు అన్ని రంగాల్లో ఉన్న విశ్వకర్మ కమ్యూనిటీకి చెందిన వారందరితో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని కన్వీనర్ దేవరకొండ కాళిదాస్, కోకన్వీనర్ అడ్లూరి రవీంద్ర చారి తెలిపారు. ఈ సమావేశంలో విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ కన్వీనర్, కో–కన్వీనర్ అడ్లూరి రవీంద్ర చారి, విశ్వవిశ్వాని యూనివర్శిటీ వ్యవస్థాపకులు తాడూరి శ్రీనివాస చారి, హెచ్ఎస్బీసీ డైరక్టర్ , గ్లోబల్ విశ్వకర్మ ఎన్ఆర్ఐ సంఘం ప్రతినిధి చైతన్య, ప్రవాస భారతీయుడు మారోజు వెంకట్, సాఫ్ట్‌వేర్ రంగం ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు.

## ఘనంగా వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదినోత్సవం

### రక్తదాన శిబిరానికి విశేష స్పందన స్పందన..




**ఖమ్మం జిల్లా ప్రతినిధి జులై 25 ప్రజాబలం:**ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ ఆధ్వర్యంలో వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ పుట్టినరోజు పురస్కరించుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నిర్వహించిన మెగా రక్తదాన కార్యక్రమాన్ని సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ జిల్లా



కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూరక్తదానం అనేది ప్రాణదానంతో సమానమైన అత్యున్నత మానవతా సేవ అని అన్నారు. ఒక యూనిట్ రక్తం అవసరంలో ఉన్న పలువురి ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు. ప్రజాసేవను రాజకీయాలకు అతీతంగా భావిస్తూ, సమాజ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్ననాయకుడుఎమ్మెల్యేమాలోత్ రాందాస్ నాయక్అని కొనియాడారు. ఎమ్మెల్యే జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా,సమాజానికిఉపయోగపడే సేవా కార్యక్రమాలతో నిర్వహించడంపట్ల డాక్టర్ మురళీకృష్ణఅభినందించారుఅభినందనీయమని తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని మానవత్వాన్ని చాటాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానాన్ని అలవాటుగా మార్చుకుని అవసరమైన సమయంలో ఇతరుల ప్రాణాలను కాపాడే బాధ్యతను స్వీకరించాలని కోరారు. ముందుగా శాంతినగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు ఆధ్వర్యంలో . పూజలు నిర్వహించిన అనంతరం సాయిబాబా మందిరంలో రాందాస్ నాయక్ దంపతులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైద్యులు, డాక్టర్ సెల్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువజన నాయకులు, స్వచ్ఛంద రక్తదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అట్లూరు మండలం కొండూరులో 50 ఎస్టీ కుటుంబాలు టీడీపీలో చేరిక

బద్వేలు బద్వేల్ నియోజకవర్గం, అట్లూరు మండలం, కొండూరు గ్రామంలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన 50 కుటుంబాలు ×బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి × సమక్షంలో శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంపై విశ్వాసంతో అన్ని వర్గాల ప్రజలు టీడీపీ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి కుటుంబానికి అండగా ఉంటూ, గ్రామాభివృద్ధికి కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:**అషాడమాస తొలి ఏకాదశి సందర్భంగా జంగల్ విఠోభ మందిరంలో శ్రీ పాండురంగ విఠోభ ని దర్శించుకున్న మాజీ ఎంపీ అంజన్‌కూమార్ యాదవ్‌కు స్వాగతం పలికి శాలువ కప్పి సన్మానించిన మందిర ఛైర్మెన్ వి.కిషన్‌యాదవ్ . ఈ కార్యక్రమంలో పాలోన్న శంకర్ యదవ్ ఎస్.ధన్‌రాజ్ ,ప్రసాద్ యాదవ్ ,రాజేష్ అగర్వాల్, నిర్మల్ కూమార్ యాదవ్ , రాఖేష్ జైస్వాల్ ,సంతోష్‌గుప్తా తదితరులు

## పిల్లల రక్షణలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం...

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానీ చంద్ర



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 25(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/పిల్లల జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానీ చంద్ర అన్నారు,జాతీయ న్యాయ సేవా సంస్థ రూపొందించిన చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ టు చిల్డ్రన్స్ స్కీమ్ --2024" మరియు తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖతో కుదిరిన అవగాహన ఒప్పందం అమలులో భాగంగా, సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నియమితులైన చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు ఒక రోజు సెన్సిటైజేషన్ కార్యక్రమాన్ని శనివారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో, జిల్లా విద్యాశాఖ సమన్వయంతో కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు,ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్ జి. భవానీ చంద్ర మరియు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు,జిల్లాలోని 239 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 239 మంది ఉపాధ్యాయులను చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా నియమించినట్లు ఈ సందర్భంగా తెలిపారు. వీరికి పిల్లల రక్షణ, హక్కుల పరిరక్షణ, పాఠశాల స్థాయిలో బాలల సమస్యలను గుర్తించడం, చట్టపరమైన రక్షణ కల్పించడం, సంబంధిత శాఖలతో సమన్వయం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు,ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానీ చంద్ర మాట్లాడుతూ,ప్రతి చిన్నారికి సురక్షితమైన, భయ,హింస రహితమైన విద్యా వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు,ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తూ, వారి ప్రవర్తనలో వచ్చే మార్పులను నిశితంగా గమనించాలని సూచించారు. బాలలపై జరిగే వేధింపులు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మాదకద్రవ్యాల ప్రభావం, పోక్సో చట్టం, సైబర్ నేరాలు వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండి, ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు,పిల్లల రక్షణను అదనపు బాధ్యతగా కాకుండా సమాజానికి చేసే గొప్ప సేవగా భావించాలని ఆమె సూచించారు,జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు సమర్థవంతంగా పనిచేస్తే బాలల రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. పిల్లలతో స్నేహపూర్వక వాతావరణాన్ని ఏర్పరచి వారి నమ్మకాన్ని పొందాలని, గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్, సైబర్ భద్రత,ఆన్‌లైన్ మోసాలు, మానసిక ఆరోగ్యం, బాలల హక్కులు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు వంటి అంశాలపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు,విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, ప్రవర్తనా మార్పులను ప్రారంభ దశలోనే గుర్తించి తల్లిదండ్రులు, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు,అదనపు పోలీసు సూపరింటెండెంట్ చైతన్య రెడ్డి మాట్లాడుతూ, బాలల భద్రతకు సంబంధించిన ప్రతి అంశాన్ని ఉపాధ్యాయులు అత్యంత బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. పిల్లలపై జరిగే నేరాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుర్వినియోగం వంటి అంశాలపై విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పించాలని, పిల్లలు లేదా తల్లిదండ్రులు భయంతో సమస్యలను బయటపెట్టలేని సందర్భాల్లో ఉపాధ్యాయులే ముందుకు వచ్చి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు,జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి. సౌజన్య మాట్లాడుతూ,చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ టు చిల్డ్రన్ స్కీం 2024 లక్ష్యాలను వివరించారు.

పాఠశాల స్థాయిలో పిల్లల సమస్యలను గుర్తించి, అవసరమైన సందర్భాల్లో జిల్లా న్యాయ సేవా సంస్థతో సమన్వయం చేసుకుని బాధిత బాలలకు ఉచిత న్యాయ సహాయం, కౌన్సెలింగ్, రక్షణ చర్యలు అందేలా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు కృషి చేయాలని సూచించారు,ఈ కార్యక్రమంలో పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి శ్రీలేఖ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.వి.ఆర్. తేజో కార్తీక్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. ధనలక్ష్మి పాల్గొని ఫోక్సోచట్టాలు, బాలల హక్కులు, పాఠశాలల్లో చైల్డ్ ప్రొటెక్షన్ మెకానిజం, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారుల బాధ్యతలు, బాలలపై వేధింపులను గుర్తించడం, బాలలకు అందుబాటులో ఉన్న న్యాయ సేవలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమగ్ర అవగాహన కల్పించారు,ఈ కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. సంజీవ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రాజారెడ్డి, వివిధ శాఖల అధికారులు, జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి నియమితులైన చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు (ఉపాధ్యాయులు), తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే అభివృద్ధి పనులకు భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

### రైల్వే, రెవెన్యూ అధికారులతో భూసేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయశ్రీ హర్ష

**పెద్దపల్లి, జూలై-25, ప్రజాబలం ప్రతినిధి :** దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో చేపడుతున్న రైల్వే లైన్ల విస్తరణ, ఆధునీకరణ పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు తో కలిసి దక్షిణ మధ్య రైల్వే, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలోని ఓదెల, పెద్దపల్లి, రామగుండం, అంతర్గాం మండలాల్లో ప్రతిపాదిత రోడ్డు ఓవర్ బ్రిడ్జులు రోడ్డు అండర్ బ్రిడ్జులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జులు నిర్మాణాలకు సంబంధించిన భూసేకరణ పురోగతిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడారు రైల్వే అభివృద్ధి పనులు ప్రజలకు దీర్ఘకాలికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులు ఎలాంటి జాప్యం లేకుండా ప్రారంభించేందుకు అవసరమైన భూసేకరణను రెవెన్యూ అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఓదెల, పెద్దపల్లి, రామగుండం, అంతర్గాం మండలాల్లో ప్రతిపాదిత రైల్వే వంతెనలు, అండర్ బ్రిడ్జులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జల నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణకు కూడా దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ లు ఓదెల వనజ , పెద్దపల్లి రాజయ్య, అంతర్గాం, రామగుండం తహసీల్దార్లు, ఏడీ సర్వేయర్, సంబంధిత రెవెన్యూ దక్షిణ మధ్య రైల్వే భూసేకరణ నిపుణులు పి. దేవరాజు (సికింద్రాబాద్), సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు హరిహరాచారి (కాజీపేట్), ఓంప్రకాశ్ (రామగుండం), రైల్వే శాఖ అధికారులు పాల్గొన్నారు.



## ఆగస్టు 1 నుండి 31 వరకు తిరుమల శ్రీవారి పుష్కరిణి మరమ్మతులు

### పునరుద్ధరణ పూర్తయ్యే వరకు పుష్కరిణి హారతి ఉండదు

తిరుమలలోని శ్రీవారి ఆలయం పక్కనే ఉన్న పవిత్రమైన స్వామి పుష్కరిణికి ఆగస్టు 1 నుండి ఆగస్టు 31 వరకు మరమ్మతు, నిర్వహణ పనులు చేపట్టనున్నారు.ప్రతి సంవత్సరం శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పుష్కరిణికి మరమ్మతులు చేయడం ఆనవాయితీ.ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15న ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఈ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు టీటీడీ జలపనుల శాఖ ఏర్పాట్లు చేస్తోంది.భారీ వర్షాలు, తుఫానులు, ఇతర ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా ముందుజాగ్రత్త చర్యగా, సెప్టెంబర్ 1 నుండి సెప్టెంబర్ 10 వరకు పుష్కరిణిని మూసివేయడం జరుగుతుంది.అందువల్ల, ఈ 40 రోజులలో పుష్కరిణి హారతి ఉండదు, భక్తులను పుష్కరిణిలోకి ప్రవేశించడానికి అనుమతించరు.భక్తులు ఈ విషయాన్ని గమనించి, టీటీడీకి సహకరించాలని కోరడమైనది.

## రోగులకు చేయూత.. మొక్కలతో ప్రకృతికి బాట –

## – ఘనంగా లాయక్ పాషా జన్మదిన వేడుకలు



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, జూలై 25:** జన్మదినాన్ని ఆడంబరాలకు పరిమితం చేయకుండా సామాజిక సేవకు అంకితం చేస్తూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా ఆదర్శంగా నిలిచారు. తన జన్మదినం సందర్భంగా వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటూ పరామర్శించారు.అనంతరం జర్నలిస్టు కాలనీలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తన వంతు బాధ్యతను చాటిచెప్పారు. ప్రతి ఒక్కరూ తమ జన్మదినం సందర్భంగా కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని, ప్రకృతిని కాపాడితేనే భావితరాలకు మంచి భవిష్యత్తు అందుతుందని ఆయన పిలుపునిచ్చారు.

తర్వాత అగ్రహారంలోని 'శ్రీ' కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో సహచర జర్నలిస్టులు, స్నేహితుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అయితే వేడుకల కంటే సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలే నిజమైన ఆనందాన్ని ఇస్తాయని లాయక్ పాషా పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ, సీనియర్ పాత్రికేయులు తాహర్ పాషా, రేగుల రాంప్రసాద్, కార్యవర్గ సభ్యులు, పలువురు జర్నలిస్టులు పాల్గొని లాయక్ పాషాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఫామ్ ల్యాండ్ పేరుతో మోసాలు



**సంగారెడ్డి జిల్లా(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా కంగిటి మండలంలో గన్ పూర్ శివారులో ఉన్నటువంటి ఎస్ ఎస్ వి గ్రీన్ స్టోన్ ఫార్మ్ ల్యాండ్ పేరుతో మోసాలు జరుపుతున్నారు

నమ్మితే నట్టేట ముంచుతున్న ఫామ్ లాండ్స్ నారాయణఖేడ్ లోని విచ్చలవిడిగా ఫార్మ్ ల్యాండ్ మోసాలు హైదరాబాద్ నుండి ప్రజలను తీసుకొచ్చి మోసాలకు గురి చేస్తున్నారు తక్కువ ధరలకు భూములు అంటూ గుంటల చొప్పున అమ్ముతూ మోసాలు చేస్తున్నారు హైదరాబాద్ నుండి ప్రజలను తీసుకొచ్చి అమాయక ప్రజలకు బోల్తా కొట్టిస్తున్నారు ఎస్ ఎస్ వి గ్రీన్ స్టోన్ ఇన్ఫ్రా అమాన్య ఫార్మ్ మోసాలు అంతా ఇంతా కాదు అమాయక ప్రజలను హైదరాబాద్ పటాన్ చెరువు నుండి తీసుకువచ్చి కంగ్టి మండలంలో ఉన్నటువంటి ఫార్మ్ ల్యాండ్ భూములను చూపిస్తామని చూపించారు చూపించాక మీరు బుక్ చేసుకోవాలి అని చెప్పగా నేను మళ్ళీ బుక్ చేసుకుంటామని వాళ్ళు చెప్పారు మీరు బుక్ చేసుకుంటే చేసుకోండి మేము మళ్లీ బుక్ చేసుకుంటామని చెప్పారు చెప్పడమే శాపంగా మారింది ఎస్ ఎస్ వి ఫార్మామ్ యాజమాన్యం అక్కడ ల్యాండ్ వద్ద దంపతులను వదిలిపెట్టి వెళ్లిపోయారు అక్కడ ఎవరూ లేరు ఆ ప్రాంతంలో వీరికి ఎవరూ తెలియదు లబోదిబోమంటూ ఆటోను పట్టుకొని పిట్లం వెళ్లి పిట్లం నుండి హైదరాబాద్ వెళ్ళిపోయారు ఎస్ ఎస్ వి ఫార్మాన్ అరాచకాలు అంతా ఇంతా కాదు కొత్త కొత్త ప్లాన్లతో కొత్త కొత్త మోసాలు చేస్తూ అమాయక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు ఇలాంటి వెంచర్లపై చర్యలు తీసుకోవాలని వాపోతున్నారు కంగ్టి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేయడం జరిగింది నాగలిగిద్ద కంగ్టి మండలలో ఎస్ ఎస్ వివి ఫార్మ్ లాండ్స్ ఉన్నాయి మేమే కార్లలో తీసుకెళ్తాం మధ్యాహ్నం భోజనం పెడతాం నచ్చితే ప్లాట్లు తీసుకోవచ్చు అని చెప్పి నారాయణఖేడ్ కు తీసుకువచ్చి వదిలిపెట్టడం ఇదేంటంటూ వాపోతున్నారు బుక్ చేసుకుంటే మంచిది లేదంటే వదిలిపెట్టి వెళ్లిపోవడమే ఈ అమాయకులను ఎందుకు తీసుకొస్తున్నారు వీరికి ఈ ప్రాంతం రేట్లు ఎలా ఉన్నాయి అన్నది తెలియదు వాళ్లకు ఇదే ఆసరా చేసుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారు గుంటల భూములంటూ కొత్త కొత్త బోర్లు కొత్త కొత్త జెండాలతో చూపించి మోసాలు చేస్తున్నారు అయ్యా అధికారులు వీరిపై చర్యలు తీసుకోవాలి. మీరు డబ్బులకు కక్కుర్తి పడి రిజర్వేషన్లు చేస్తున్నారు కానీ అమాయక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు అమాయకుల ప్రజల మోసపోకుండా చూడవలసిన బాధ్యత జిల్లా అధికారులపై ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు

## ఉపాధి హామీ పథకం ద్వారా వంద శాతం నీటి కుంటల ఏర్పాటుకు సబ్సిడీ. ఏఈఓ నాగులు మీరా



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జులై 25 ప్రజాబలం:**ముదిగొండ మండలం గంధసిరి గ్రామపంచాయతీ వద్ద ఏఈఓ షేక్ నాగుల్ మీరా వివిధ డిపార్ట్మెంట్ల వారి ఆధ్వర్యంలోఅత్యవసర ప్రణాళిక ఎల్-నినో ప్రభావం గురించి వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల గురించి అవగాహన కల్పించారు, వరి విస్తీర్ణం తగ్గించి ఆరుతడి పంటలైనటువంటి మినము,కంది,పెసర, అపరాలు, కూరగాయలు, మిల్లెట్స్ సాగు చేయాలని రైతులకు సూచించారు, మరియు ఫార్మ్ పౌండ్స్ నీటి కుంటల తీసుకోవాలని నీటి కుంటలు తీసుకోవడం వల్ల బోర్లు రీఛార్జ్ అయ్యి గ్రౌండ్ వాటర్ లెవెల్స్ పెరిగి బావులలో నీళ్లు వస్తాయని తెలియజేశారు, భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని తెలియజేయడం జరిగింది ఉపాధి హామీ పథకం కింద ఈ నీటి కుంటలు 100% సబ్సిడీలో ఐదు ఎకరాల లోపు ఉండి కరువు పని జాబ్ కార్డు ఉన్న రైతులు అర్హులు అని చెప్పటం జరిగింది, అలాగే వెటర్నరీ డిపార్ట్మెంట్ నుంచి అనిత మాట్లాడుతూ పశుగ్రాసం విత్తనాల గురించి రైతులకు అందుబాటులో ఉన్న వివరాలను చెప్పడం జరిగింది, ఫీల్డ్ అసిస్టెంట్ నీటి కుంటలు ఇంకుడు గుంతల గురించి గురించి రైతులకు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో గంధసిరి సర్పంచ్ మల్లెల రామారావు మాట్లాడుతూ రైతులందరూ ఆరితడి పంటలు వేసుకోవాలని అలాగే పంట కుంటలు తీసుకోవాలని గ్రామ రైతులు అందరికీ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎస్కే. రఫీ, వార్డ్ మెంబర్లు, గ్రామ సెక్రెటరీ కృష్ణ రైతులు రాఘవరెడ్డి, జవాజి శ్రీను,వెంకటరావు,గంగిరెడ్డి.సోమయ్య, శ్రీను,కృష్ణ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తుల జిల్లాల పర్యటన

### స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ మాధవీ లతలకు జిల్లా కలెక్టర్ పూల మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తులు శనివారం, ఆదివారం రెండు రోజులపాటు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు.

# ఓటు ప్రక్షాళనకు బి ఆర్ ఎస్ మద్దతు



**గండిపేట ప్రజాబలం ప్రతినిధి 25 జులై 2026**భారత దేశ రాజకీయ చరిత్రలో పెను మార్పు దిశగా, రాజ్యాంగ బద్దంగా ఓటు ప్రక్షాళనకు చేపట్టిన ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) హోర్సుంచ తగ్గ విషయం కాగా, రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో మణికొండ, నెక్నంపూర్ డివిజన్ లలో గణనీయ మార్పు ఉంటుందని, ఇట్టి ప్రక్రియలో బూతులెవల్ అధికారుల పాత్ర ఎంత కీలకమో – ప్రజల పాత్ర కూడా అంతే కీలకం అని, తమ వద్ద ప్రస్తుతం ఓటర్ కార్డు ఉన్నది కావున తాము మళ్లీ ఈ



యెన్యూమరేషన్ ఫారమ్ లు నింప వలసిన అవసరం లేదనె అభిప్రాయంతో ఉండకుండా, అశ్రద్ద చేయకుండా స్థానిక నివసిత కుటుంబ సభ్యులు ప్రతి ఒక్క ఓటర్ తమ ఓటును 2002 లోని స్వంత ఓటు లేదా తమ పెద్దల ఓటుతో జత కలుపడం (మ్యాపింగ్ చేయడం) తప్పని సరి అని అప్పుడే తమ ఓటు హక్కు ఉంటుందని అన్యధా ఓటు గల్లంతకు ఆస్కారం ఉందని, ఈ విషయమై శనివారం రోజున భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు మణికొండ, నెక్నంపూర్ డివిజన్ స్థానిక ఓటర్లకు పైన పేర్కొన్న అంశాల విధి విధానాలను విడమర్చి చెబుతూ సహకారన్ని అందించామని బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు అందె లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, దేవి ప్రియ, మంజు తెలిపారు.

## జహీరాబాద్ లో ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు



**జహీరాబాద్, జూలై 25 ప్రజాబలం ప్రతినిధి:**సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా తొలి ఏకాదశి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

జహీరాబాద్ పట్టణంలోని శ్రీ రుక్మిణి సమేత పాండురంగ స్వామి దేవాలయంతో పాటు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో



ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాల్లో భజనలు, హరినామ సంకీర్తనలు నిర్వహించగా, భక్తులు ఉపవాస దీక్షలు పాటిస్తూ తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తిపూర్వకంగా జరుపుకున్నారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి.

## పోటీ పరీక్షలు విజయం సాధించాలి, పుస్తకాలు వితరణ

## ఇన్కమ్ టాక్స్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జులై 25 ప్రజాబలం:**పెనుబల్లి మండల పరిధిలోని టేకులపల్లి మోడల్ స్కూల్ లోని విద్యార్థులకు నీట్ ఇంజనీరింగ్. సి ఏ లాంటి పోటి పరీక్షల కోసం పాఠశాల లైబ్రరీ కి సుమారు లక్ష విలువైన పుస్తకాలు వితరణగా ఇన్కమ్ టాక్స్ ఉద్యోగి సుబ్రహ్మణ్యం అందించారు. టేకులపల్లి లో పుట్టి నేడు ఐ ఎఫ్ ఎస్ లో ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ లో పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం పేద విద్యార్థులు కోసం వాళ్ళు పోటీ పరీక్షల్లో విజయం సాధించి జీవితం లో గొప్ప స్థాయిలో ఉండాలని ఆశిస్తూ పుస్తకాలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ పుస్తకాలు సద్వినియోగ పరుచుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో వారి స్నేహితులు. పాఠశాల సిబ్బంది. శ్రీమంతుడు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## రేవంత్ ప్రభుత్వంపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు:

## విద్యుత్, నీటి సరఫరాలో వైఫల్యం

హైదరాబాద్ స్తెలంగాణ మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సోలిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ రికార్డులు పరిశీలించిన ఆయన, గతంలో రైతులకు 14-15 గంటల విద్యుత్ అందించగా ఇప్పుడు 12 గంటలే ఇస్తున్నారని ఆరోపించారు. మిషన్ భగీరథ ద్వారా బీఆర్ఎస్ ఐదేళ్లు తాగునీరు అందించిందని, ప్రస్తుతం ఆ వ్యవస్థను కూడా ప్రభుత్వం సరిగా నిర్వహించలేక పోతోందన్నారు. మహిళలు నీటి కోసం, రైతులు ఎరువులు, విద్యుత్ కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

# ముఖ్యమంత్రికి ఉద్యోగుల పోస్ట్ కార్డుల వినతి.

**కేజీబీవీ, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి.**

**29 రోజుల సమ్మె వేతనం తక్షణమే చెల్లించాలి -- టీఎస్ యుటిఎఫ్ డిమాండ్**

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జులై 25 ప్రజాబలం:**కేజీబీవీ,యుఆర్ ఎస్,సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని టీఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేసింది. టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో



భాగంగా ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డికి కేజీబీవీ, టిఆర్ఎస్,సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై పోస్ట్ కార్డు ఉద్యమాన్ని మండల కేంద్రంలో టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రామ్ చంద్, మూడ్.పుల్లయ్య లు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీబీవీ, యుఆర్ఎస్,సమగ్ర శిక్ష ఉద్యోగ ఉపాధ్యాయులు దశాబ్దాలుగా శ్రమదోపిడికి గురవుతున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగస్తులకు ఇస్తున్న హెల్త్ కార్డ్స్ ను వారికి కూడా జారీ చేయాలని, మిగతా ఉపాధ్యాయులకు వర్తింపజేసే అన్ని రకాల సెలవులు ఇవ్వాలని కోరారు. గతంలో చేసిన సమ్మె కాలానికి చెందిన 29 రోజుల వేతనం తక్షణమే చెల్లించాలన్నారు.కేర్ టేకర్లను నియమించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పోస్ట్ కార్డు ఉద్యమం ద్వారా ప్రభుత్వంలో కదలిక రావాలని కోరారు.లేని పక్షంలో రాబోయే కాలంలో ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రాఘవరావు,శ్రీదేవి, శంకర్రావు, నరసింహారావు, దివ్య,కేజీబీవీ ఇంచార్జ్ శ్రవంతి, విజేత,మంగతాయి, నీలావతి,శైలజ, రాధిక,అపర్ణ,సరిత, కవిత, స్వరూప, జ్యోతి, తులసి, మంగమ్మ, ప్రసాద్, శివాజీ,సుమన్, లత,హరిత, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అక్క కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలి.

## మహిళా పోలీసులకు అవగాహన కల్పించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై 25 ప్రజాబలం:** జిల్లాలో అమలు చేయనున్న "పోలీస్ అక్క" కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు




మహిళా పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ప్రత్యేక అవగాహన సమావేశంను శనివారం నాడు జిల్లా ఎస్పీ కార్యాలయం నందు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నియమితులైన మహిళా పోలీస్ కానిస్టేబుళ్లు "పోలీస్ అక్క"గా విద్యాసంస్థలను క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు మహిళల భద్రత, బాలల రక్షణ,



సైబర్ నేరాల నివారణ, పోక్సో చట్టం, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, ర్యాగింగ్ నిరోధం, బుల్లీయింగ్, ఈవ్ టీజింగ్, స్టాకింగ్, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్భయంగా పోలీసులకు తెలియజేసేలా విశ్వాసాన్ని కల్పించాలని సూచించారు.

అదేవిధంగా, ఏదైనా నేరానికి సంబంధించిన సమాచారం అందిన వెంటనే సంబంధిత షీ టీమ్ ఎస్‌హెచ్ఓ కు సమాచారం అందించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా సమన్వయం చేయాలని ఆదేశించారు. విద్యాసంస్థలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ, కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రతి మహిళా పోలీసు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.

"పోలీస్ అక్క" కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసి మహిళలు, బాలికల భద్రతకు మరింత భరోసా కల్పించాలని మహిళా పోలీసు సిబ్బందికి సూచించారు.

ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, షీటీం ఎస్‌హెచ్ఓ రమాదేవి, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తొలిఏకాదశి నేపథ్యంలో ప్రత్యేక పూజలు

# గర్షకుర్తిలో అఖండ భజన సంకీర్తన కార్యక్రమం

చొప్పదండి కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో తొలిఏకాదశి పర్వదినం పురస్కరించుకుని 24 గంటల అఖండ భజన సంక్తీరణ కార్యక్రమం శనివారం ఉదయం చేపట్టారు.ఈ భజన సంకీర్తన కార్యక్రమం ఆదివారం ఉదయం వరకు నిర్విరామంగా కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు.ప్రతి యేటా తొలిఏకాదశి పర్వదినం రోజున అఖండ భజన సంకీర్తన జరుగుతోందని గత 40 ఏళ్లుగా ఎంతో భక్తిప్రపత్తుల మధ్య భజనపరులు సిని, జానపద బాణిలో భక్తిగీతాలను ఆలపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భక్తి శ్రద్దలతో పాల్గొంటున్నారు.

# చింత చెట్ల నరికివేత.. కాంట్రాక్టర్‌పై చర్యలు

### ఫారెస్ట్ కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్

### మారజాతి కలపకు అనుమతి,చింత చెట్ల నరికివేత.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూలై 25:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలంలోని వేదాంతపురం, లంకలపల్లి ప్రాంతాల్లో ఫారెస్ట్ కార్పొరేషన్ పరిధిలో మారుజాతి కలపను వేలం (ఆక్షన్) ద్వారా కొనుగోలు చేసిన కాంట్రాక్టర్, అనుమతి లేకుండానే ఫలాలు ఇచ్చే చింత చెట్లను నరికివేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.



ఈ ఘటనపై అక్కడి డిప్యూటీ ప్లాంట్ మేనేజర్ ఫారెస్ట్ కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్ (డీఎం)కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డివిజనల్ మేనేజర్ మీడియాతో మాట్లాడుతూ, అనుమతి లేని చెట్లను నరికిన కాంట్రాక్టర్‌పై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అయితే, నరికిన చింత చెట్లు పడిపోయే స్థితిలో ఉండటంతోనే వాటిని తొలగించామని కాంట్రాక్టర్ వివరణ ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

నరికివేసిన చెట్లను తరలిస్తున్న లారీని అధికారులు స్వాధీనం చేసుకుని ఫారెస్ట్ కార్పొరేషన్ కార్యాలయానికి తరలించారు. పై అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీమన్నారాయణ హోమం..!

### - ప్రారంభమైన గురుపౌర్ణమి ఉత్సవాలు

### - గురు చరిత్ర పారాయణంలో భక్తులు

**జహీరాబాద్, జూలై 25 ప్రజా బలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఈ నెల 29న జరగనున్న వ్యాసపౌర్ణమి (గురుపౌర్ణమి) ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ గణపతి పూజ, గోపూజ, గురు చరిత్ర పారాయణం నిర్వహిస్తున్నారు.



శనివారం తొలి ఏకాదశి సందర్భంగా ఆశ్రమంలో వైభవంగా శ్రీమన్నారాయణ హోమం నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, నవగ్రహ పూజ, అగ్ని ప్రతిష్ఠ, సంకల్పం తదితర కార్యక్రమాలను వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం యజ్ఞగుండంలో నెయ్యి, సమిధలు, నవధాన్యాలు, ఔషధ ద్రవ్యాలను సమర్పిస్తూ "ఓం నమో నారాయణాయ" మంత్రోచ్చారణల మధ్యశ్రీమన్నారాయణ హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, మహామండలేశ్వర్ డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ ఆధ్వర్యంలో వేద పాఠశాల విద్యార్థుల వేదఘోషలు, మంగళ వాయిద్యాల నడుమ పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. హోమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదింస్వామ ఈ కార్యక్రమంలో ఆనందగిరి స్వామి, నందినిగిరి స్వామి, అర్చకులు శ్రీపాద్ స్వామి, నాగేంద్రయ్య స్వామి, వేద పాఠశాల విద్యార్థులు, ఆశ్రమ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహనతోనే హక్కుల పరిరక్షణ సాధ్యం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. ప్రభాకర రావు

### బాలల రక్షణ, హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: జిల్లా కలెక్టర్ రాజర్షి షా




**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి** జూలై 25, 2026 -- ఆదిలాబాద్ ప్రజల్లో చట్టాలపై సమగ్ర అవగాహన పెంపొందినప్పుడే రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా వినియోగించుకోగలరని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా చట్టపరమైన సేవల సంస్థ (డీఎల్ఎస్ఏ) ఛైర్మన్ కె. ప్రభాకర రావు అన్నారు. న్యాయ అవగాహనను గ్రామస్థాయి వరకు విస్తరించి ఆదిలాబాద్ జిల్లాను వివాదరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా చట్టపరమైన సేవల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నాల్సా చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్' అవగాహన సదస్సు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, బాలల రక్షణ అధికారుల ఓరియెంటేషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, భారత రాజ్యాంగం గర్భస్థ శిశువు నుంచి మరణించిన వ్యక్తి వరకు ప్రతి ఒక్కరి హక్కులను పరిరక్షించే గొప్ప రాజ్యాంగమని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు బాధ్యతలను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా జిల్లా చట్టపరమైన సేవల సంస్థను సంప్రదించాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలు, పిల్లలు తదితర అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని, ప్రజలు ఈ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు. పిల్లల హక్కుల పరిరక్షణపై పాఠశాలల్లో చేపట్టనున్న అవగాహన కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడు పాఠశాలలకు వచ్చే జనవరిలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా ప్రత్యేక అవార్డులు అందజేయనున్నట్లు ప్రకటించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, బాలికల సంక్షేమం, బాలల హక్కులు, చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఏడాది పొడవునా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నట్లు తెలిపారు. జూన్ నుంచి వచ్చే ఏడాది మే వరకు ప్రతి నెల ఒక నిర్దిష్ట అంశాన్ని ఎంపిక చేసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, చర్చలు, ఓరియెంటేషన్ తరగతులు, పోటీలు నిర్వహించాలని సూచించారు. బాలల హక్కులు, పోక్సో చట్టం, సైబర్ భద్రత, మంచి-చెడు స్పర్శ, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలు కేవలం విద్య బోధించే కేంద్రాలుగా కాకుండా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, విలువల పెంపొందింపుకు వేదికలుగా మారాలని అన్నారు. ప్రతి మూడవ శనివారం నిర్వహించే పేరెంట్-టీచర్ సమావేశాల్లో తల్లిదండ్రులకు కూడా బాలల రక్షణ, సైబర్ నేరాలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

విద్యార్థుల్లో పెరుగుతున్న మొబైల్ ఫోన్ వినియోగం, సోషల్ మీడియా ప్రభావంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల ప్రవర్తనలో అకస్మాత్తుగా వచ్చే మార్పులను గుర్తించి వెంటనే తల్లిదండ్రులతో చర్చించి తగిన కౌన్సెలింగ్ అందించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు తమ సమస్యలను గోప్యంగా తెలియజేసేందుకు ఫిర్యాదు పెట్టెలు (కంప్లైంట్ బాక్సులు) ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలను ఒకరిద్దరు ఉపాధ్యాయుల బాధ్యతగా కాకుండా మొత్తం ఉపాధ్యాయ బృందం సమిష్టిగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలు, సంబంధిత అధికారులకు 2027 మే నెలలో జిల్లా స్థాయి, అనంతరం హైకోర్టు స్థాయిలో ప్రత్యేక గుర్తింపు, ప్రశంసలు లభించే అవకాశం ఉందని తెలిపారు.

అదనపు ఎస్పీ మౌనిక మాట్లాడుతూ, బాలల భద్రత, పోక్సో చట్టంపై అవగాహన కల్పించడంలో "పోలీస్ అక్క" కార్యక్రమం విశేష ఫలితాలు సాధిస్తోందన్నారు. గత జూన్ నుంచి ఇప్పటివరకు 43 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతో పాటు 100కు పైగా ఫిర్యాదులు స్వీకరించి, 23 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల ప్రవర్తనలో కనిపించే మార్పులను ఉపాధ్యాయులు ముందుగానే గుర్తించి స్పందిస్తే అనేక మంది పిల్లల భవిష్యత్తును రక్షించవచ్చని ఆమె పేర్కొన్నారు.

జిల్లా చట్టపరమైన సేవల సంస్థ కార్యదర్శి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఉపాధ్యాయులను బాలల రక్షణ అధికారులుగా భాగస్వామ్యం చేస్తూ ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, సైబర్ భద్రత, బాలల హక్కులపై విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాదవి,
బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, బాలల సంరక్షణ అధికారి రాజేంద్ర ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, బాలల రక్షణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇది భారత యువత సాధించిన ఘన విజయం

## మంత్రి దామోదర్ రాజనర్సింహ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 25 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** :కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా మన ప్రజాస్వామ్య శక్తికి నిజం-న్యాయం--జవాబుదారీతనం కోసం అలుపెరుగని పోరాటం చేసిన లక్షలాది మంది విద్యార్థులు,తల్లిదండ్రులు, యువత సంకల్పానికి నిదర్శనం.విద్యార్థుల భవిష్యత్తు కోసం వారికి అండగా నిలిచి, వారి గొంతుకను పార్లమెంట్ లోపల, బయట బలంగా వినిపిస్తూ,కేంద్ర ప్రభుత్వాన్ని నిరంతరం జవాబుదారీతనం కోరిన ప్రతిపక్షాల పోరాటాన్ని అభినందిస్తున్నాను.

ఈ రాజీనామాతో సమస్య ముగిసిపోకూడదు. దేశంలోని ప్రతి విద్యార్థి నమ్మకాన్ని పొందేలా పారదర్శకమైన, విశ్వసనీయమైన, ప్రతిభకు న్యాయం చేసే పరీక్షా వ్యవస్థను నిర్మించేందుకు సమగ్ర సంస్కరణలకు ఇది ఆరంభం కావాలి. యువత న్యాయం కోసం ఏకమైతే... ప్రజాస్వామ్యం తప్పక స్పందిస్తుంది. అని మంత్రి దామోదర్ రాజనర్సింహ, పేర్కొన్నారు......

# విశ్వంలో వీలీనం, వెస్సో ట్రస్ట్ ల సేవా కార్యక్రమం

హైద్రాబాద్ జులై 25 :వైద్యం చేయించడానికే ఇబ్బంది పడిన కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తి చేయడానికి సమర్థత లేని పరిస్థితిలో, విషయం వారి బంధువుల ద్వారా తెలుసుకొన్న విశ్వంలో విలీనం మరియు వెస్సో ట్రస్ట్ సేవా సంస్థలు సంయుక్తంగా 10,000 ఆర్థిక సహాయం రవికుమార్ పెద్ద కుమారుడు పాండురంగాచారి కి అందజేసినట్లు విశ్వంలో విలీనం సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పెంట శ్రీనివాస ఆచార్య తెలియజేశారు.

కృష్ణాజిల్లా జగ్గయ్యపేట కు చెందిన పెంటపాటి రవికుమార్ (53) బంగారపు పని చేసుకుంటూ జీవనం సాగించేవారు.

కొద్ది నెలలుగా రవికుమార్ అనారోగ్యం బారిన పడ్డారు. తుదకు ఇటీవల వారి అవయవాలు పనిచేయడం మానేసిన పరిస్థితి లో వారి కుటుంబ సభ్యులు రవి కుమార్ ను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. దురదృష్టవశాత్తు, వైద్యం పొందుతూనే రవికుమార్ కన్నుమూశారు.

ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ అంత్యక్రియల వంటి పుణ్యకార్యాలకు సహాయం అందిస్తున్న గౌరవ దాతలకు పేరుపేరునా ధన్యవాదములు తెలిపారు.

## యువత పట్టువదలని పోరాటంతో ఢిల్లీ పీఠం కదిలింది....

### సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 25(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/దేశవ్యాప్తంగా లక్షలాది మంది నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల ఆశలను,కలలను ఛిద్రం చేసిన 'నీట్' పేపర్ లీకేజీ కుంభకోణం కేంద్ర ప్రభుత్వ చేతకానితనానికి నిలువెత్తు అద్దం పడుతోంది.ఎన్నో ఏళ్లుగా రాత్రింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తును కొందరు దళారులు,అక్రమార్కులు మార్కెట్లో అమ్ముకోవడం మన విద్యా వ్యవస్థకే అతిపెద్ద అవమానం,అయితే, ఈ అన్యాయాన్ని మౌనంగా భరించకుండా తమ హక్కుల సాధన కోసం నేటి యువత ఢిల్లీ వీధుల్లోకి వచ్చి చేసిన పోరాటం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టం,సత్యాన్ని ఎంతకాలం దాచినా సూర్యుడిని మేఘాలు శాశ్వతంగా కప్పలేనట్లే" విద్యార్థుల ఆవేదన దేశ ప్రజల ముందుకు వచ్చింది. లాఠీ దెబ్బలకు నెత్తురోడుతున్నా వెనక్కి తగ్గని యువత ధైర్యం దేశానికి స్ఫూర్తిగా నిలిచింది."నిప్పును గుప్పెట్లో దాచలేరు" అన్నట్లు, నీట్ అక్రమాల నిజాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి,తమకు జరిగిన అన్యాయంపై నిలదీస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధానిలో విద్యార్థులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షలు,శాంతియుత ఆందోళనలు దేశం మొత్తాన్ని కదిలించాయి,కానీ, విద్యార్థుల బాధను అర్థం చేసుకుని భరోసా ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం,వారిపై పోలీసులతో లాఠీచార్జ్ చేయించడం అత్యంత దారుణం,హక్కుల కోసం ప్రశ్నించే గొంతులను పోలీసు బలగాలతో దౌర్జన్యాలతో అణచివేయాలని చూడటం పాలకుల అహంకారానికి నిదర్శనం,లాఠీ దెబ్బలకు నెత్తురోడుతున్నా వెనక్కి తగ్గకుండా నిలబడిన యువత తెగువ ముందు కేంద్రం అణచివేత వ్యూహాలు పటాపంచలయ్యాయి,ఈ మహోద్యమం దెబ్బకు ఎట్టకేలకు ఢిల్లీ పీఠం కదిలింది,లక్షలాది మంది విద్యార్థులు,వారి తల్లిదండ్రులు వీధుల్లోకి వచ్చి నినదిస్తుంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేవలం నామమాత్రపు ప్రకటనలు చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారు. కానీ యువత పట్టువదలని పోరాటం, దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన ఆగ్రహం చూసి చివరికి కేంద్ర ప్రభుత్వం మెట్టు దిగక తప్పలేదు,ఈ అక్రమాలకు పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడం ముమ్మాటికీ మన విద్యార్థుల పోరాట విజయమే. ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా మాత్రమే కాదు.. ఢిల్లీ పాలకుల అహంకారంపై మన జెన్జీలు సాధించిన చారిత్రాత్మక విజయం.ఈ నీట్ పోరాటం దేశ యువత ఆత్మగౌరవ సమరానికి ప్రతీకగా నిలిచింది ఈ తరం యువత కేవలం సోషల్ మీడియాకే పరిమితం అని తక్కువ అంచనా వేసిన వారికి వాళ్లు రోడ్ల మీదకు వస్తే ఎంతటి బలమైన ప్రభుత్వాలైనా తలవంచక తప్పదని ఈ ఉద్యమం నిరూపించింది,అయితే మంత్రి రాజీనామాతోనే ఈ సమస్య పూర్తిగా పరిష్కారం కాదు నీట్ అక్రమాల వెనుక ఉన్న అసలు సూత్రధారులందరికీ కఠిన శిక్షలు పడేవరకు, బాధితులైన ప్రతి విద్యార్థికీ న్యాయం జరిగే వరకు ఈ పోరాట స్ఫూర్తిని ఇలాగే కొనసాగించాలి. విద్యా వ్యవస్థలో పూర్తి పారదర్శకత తీసుకువచ్చేంత వరకు విద్యార్థులకు,యువతకు అండగా నిలబడతాం.

## జెవిఆర్ సిహెచ్‌పిని సందర్శించిన రైల్వే బోర్డు ఈడి.

### కోల్ రవాణా పెంపుపై అధికారులతో సమీక్ష..



**సత్తుపల్లి ప్రజాబలం ప్రతినిధి జూలై 25:** మనుగూరు మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్, రైల్వే బోర్డుకు చెందిన ట్రాఫిక్ ట్రాన్స్పోర్టేషన్ (కోల్) విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సయ్యద్ అబ్దుల్ రహమాన్ శుక్రవారం సత్తుపల్లి ఏరియాలోని జెవిఆర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌ను సందర్శించారు.

ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) ఉ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ శ్రీ బి. వెంకన్న ఐఆర్టిఎస్, సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ఉన్నారు. ముగ్గురు కలిసి సిహెచ్‌పి ఆవరణలో మొక్కలు నాటారు.

అనంతరం సైలోబంకర్, రైల్వే లోడింగ్ పాయింట్లు, సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలించారు. సత్తుపల్లి ఏరియా నుండి రైలు మార్గం ద్వారా జరుగుతున్న బొగ్గు రవాణా, డిస్పాచ్ వివరాలను సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ డి. నరేంద్ర వర్మ, ఏరియా జిఎం చింతల శ్రీనివాస్ వివరించారు.

రాబోయే రోజుల్లో బొగ్గు రవాణాను పెంచే అవకాశాలు, లోడింగ్ సామర్థ్యం మెరుగుదల, రైల్వే – సింగరేణి మధ్య సమన్వయంపై ఈ సమావేశంలో చర్చించారు. లక్ష్యాల సాధనకు అన్ని చర్యలు తీసుకోవాలని ఈడి అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జెవిఆర్ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహ్లాద్, ఏరియా ఇంజనీర్ శ్రీ కె. సోమశేఖర రావు, జిఎం బొల్లం శ్రీనివాస్ సాయినాథ్, ఎ. రవి కుమార్ తో పాటు ఇతర రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి సేవలు అమోగం

### పదవీవిరమణ సందర్భంగా సన్మానించిన అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, కార్మిక సంఘాలు

**పెద్దపల్లి/గోదావరిఖని, జులై-25, ప్రజాబలం ప్రతినిధి:** సింగరేణి రామగుండం ఏరియా-1 పర్సనల్ విభాగంలో పర్సనల్ మేనేజర్ గా విశిష్ట సేవలు అందించి ఈ నెల పదవీ విరమణ పొందుతున్న ముప్పిడి రవీందర్ రెడ్డి ని శనివారం పలువురు అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు రవీందర్ రెడ్డి ని శాలువాతో సన్మానించారు. ముప్పిడి రవీందర్ రెడ్డి సింగరేణి సంస్థ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఉద్యోగుల





సంక్షేమం, కార్మిక, యాజమాన్య సంబంధాల మెరుగుదల, సేవా నియమాల అమలు, సమస్యల పరిష్కారం వంటి అంశాలలో సమర్థవంతంగా పనిచేసి అందరి అభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు. తన సేవా కాలమంతా నిబద్ధత, క్రమశిక్షణ, పారదర్శకతతో విధులు నిర్వర్తించి సహోద్యోగులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో ఆనందకరమైన జీవితం గడపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

తనకు అందించిన గౌరవానికి స్పందించిన ముప్పిడి రవీందర్ రెడ్డి, తన సేవా కాలంలో సహకరించిన సింగరేణి యాజమాన్యానికి, అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రరావు, డి. రమేష్ బాబు, ఎజ్జగిరి శివయ్య, డి. గణేష్, దొంత వెంకటేశ్వర్లు, ఎం.డి. సల్మాన్ ఖాన్, ఆర్. దామోదర్, దేవాచారి, అన్వేష్ క్లరికల్ సిబ్బంది, ఉద్యోగులు, కార్మికులు, కార్మిక సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ నీటితో అధిక దిగుబడును ఇచ్చే పంట రకాలను ఎంచుకోవాలి..

### జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జులై 25 ప్రజాబలం:** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి దనస పుల్లయ్య , ఏడిఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, మండల వ్యవసాయ శాఖ అధికారి మయన్ మంజుఖన్ వైరా మండలంలోని వివిధ

లక్ష్యం పురం, పాలడుగు, గరికపాడు గ్రామాల్లో సందర్శించి రైతులకు పంటలపై ఎల్ నినో ప్రభావంపై అవగాహన కల్పించారు . ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య మాట్లాడుతూ

రైతులు ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా వానాకాలం సీజన్లో స్వల్పకాలిక తక్కువ నీటితో అధిక దిగుబడును ఇచ్చే పంట రకాలను ఎంచుకోవాలని సూచించారు.

ఏడిఏ తుమ్మలపల్లి కరుణశ్రీ మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటలైన పెసలు, మినుములు, కందులు, జొన్నలు మరియు ఇతర చిరుధాన్యాల పంటలు పండించాలని సూచించారు. ఈ సంవత్సరం భూగర్భ జలాలు అడుగంటి పోవడం జరుగుతుంది కాబట్టి ముందస్తు ప్రణాళికలో భాగంగా వరి మరియు మిర్చికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలను వేయాలని సూచించడం జరిగింది. మండల వ్యవసాయ శాఖ అధికారి మయన్ మంజుఖన్ మాట్లాడుతూ..

మండలంలో జూలైలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతున్న నేపథ్యంలో భూగర్భ జలమట్టం తగ్గుతుందని భూగర్భ జలాలు పెంచేలా రైతులు ఫార్మ్పండ్స్ (పంట కుంటలు) ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం విబిజీ రామ్ జి పథకం ద్వారా 100% రాయితీపై అందిస్తుందని,ఈ ఫార్మ్ పాండ్స్(పంట కుంటలు) పథకాన్ని రైతులందరూ అధిక మొత్తంలో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో

లక్ష్యం పురం గ్రామ సర్పంచ్

వెంకటేశ్వరరావు, గరికపాడు సర్పంచ్ లక్కిరెడ్డి నాగలక్ష్మి, పాలడుగు సర్పంచ్ గద్దెల నరసింహారావు, ఏఈఓ లు వెంపటి కీర్తి, పరిటాల వెంకట నరసయ్య, మేడా రాజేష్, దొడ్డ పుల్లయ్య, మల్లు రామకృష్ణ, వాసంశెట్టి ప్రసాదు, అడు స్మెల్లి గణేష్, కోసూరి వెంకటరమణ, మోదుగు జానయ్య, ఆలీ, పంచాయతీ కార్యదర్శులు

,వివిధ గ్రామాలు రైతులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ లో సంస్మరణ సభ విజయవంతానికి పోస్టర్ల ఆవిష్కరణ



**కొనరావుపేట ప్రజాబలం దినపత్రిక, జూలై 25:** రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో భారత కమ్యూనిస్టు విప్లవ ఉద్యమ నిర్మాతలు కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు, కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి సంస్మరణ సభ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు.ఈ సంద ర్భంగా జిల్లా కార్యదర్శి అటిపాముల శ్రీనివాస్ మాట్లాడుతూ, జూలై 30న హుస్నాబాద్‌లో నిర్వహించనున్న సంస్మరణ సభకు రైతులు, కార్మికులు, మేధావులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విప్లవ ఉద్యమ నాయకుల ఆశయాలను నేటి తరానికి చాటిచెప్పాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు జింక సుధాకర్, కుమ్మరి దిలీప్ కుమార్, శ్రీనివాస్, శంకర్, దేవనర్సయ్య, రాజనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## పవర్ హౌజ్ దుర్గాదేవి ఆలయంలో శాకాంబరీ అమ్మవారి ఉత్సవాలు




**పెద్దపల్లి/గోదావరిఖని, జూలై -25, ప్రజాబలం ప్రతినిధి:** గోదావరిఖని పట్టణంలోని పవర్ హౌస్ దుర్గాదేవి ఆలయంలో ఈ నెల 29న బుధవారం రోజున ఆషాఢ మాస విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు అశోక్ చారి తెలిపారు. ఈ సందర్భంగా వారు కమిటీ శ్రేణులతో కలిసి దుర్గా అమ్మవారి ఆలయంలో విశేష పూజల విషయమై తెలియజేశారు. ఆషాఢ మాసం పౌర్ణమి సందర్భంగా దుర్గా దేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా శాకాంబరి అలకరణతో కూడిన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారికి ఆషాఢ పౌర్ణమి రోజు అన్ని కూరగాయలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అర్చకులు అశోక్ చారి, ఆలయ కమిటి సభ్యులు పేర్కొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com